ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
7
శనివారం 7 డిసెంబరు 2024



రాయచోటి మండలం గరుగుపల్లి సమీపంలో సర్వే నెంబర్ 356/2లో ఇది ప్రభుత్వ స్థలమని గతంలో బోర్డు పెట్టిన రెవెన్యూ అధికారులు


ఎటు చూసినా కబ్జాలే..



356/2లో స్థలం కబ్జా చేసి బోర్డును తొలగించి పొలం సాగు చేసిన దృశ్యం

- వాగు, వంక, ప్రభుత్వ భూములనూ వదలని వైసీపీ నేతలు
- కబ్జాదారులకు కొమ్ము కాస్తున్న రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ భూములని బోర్డులు పెట్టినా లెక్కచేయని కబ్జాదారులు
- అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు కొందరు దేనినీ వదల్లేదు. వంక, వాగు, చెరువు, ప్రభుత్వ స్థలం ఇలా ఏది వారి కంట పడినా దానిని కబ్జా చేసేశారు. రెవెన్యూ అధికారులు కొందరు వారికి అండగా ఉండి కబ్జాలపర్వాన్ని దగ్గరుండి చేయించినట్లు, ఇందుకు లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన రాయచోటి చుట్టుపక్కల భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో ప్రభుత్వ భూమి ఎక్కడున్నా వైసీపీ నాయకులు అక్కడ వాలిపోయి దానిని కబ్జా చేసేశారు. ఇది ప్రభుత్వ భూమి అని అధికారులు బోర్డులు పెట్టినా వాటిని తొలగించేసి మరీ కబ్జాలపర్వం యథేచ్ఛగా సాగించారు.


అర్జీ రశీదు
PGRS COLLECTORATE Annamayya

Your Request No (Grievance No)	ANMY20240930212
అర్జీ నమోదు తేది	30-09-2024
అర్జీ విభాగము	Revenue (CCLA)->Land Grabbing->Action Against Land Grabbing
పేరు	E. ANJANEYULU
ఫోను	9347779147
మండలము	Rayachoty
నివాసము	PEMMADAPALLE (R), 11190036
ప్రస్తుత నివాసం	5/68, 5/68, PEMMADAPALLI (R), 11190036, Rayachoty, Annamayya
పరిష్కరించు అధికారి	Tahsildar, Rayachoty
గడువు	60 Day(s)
పరిష్కరించు గడువు తేది	29-11-2024

ప్రభుత్వ భూములు కబ్జాపై స్పందనలో ఆంజనేయులు ఫిర్యాదు చేసిన రసీదు

రాయచోటి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో కూడా వైసీపీ నేతలు వాగులు, వంకలు, పోరంబోకు భూములను కూడా వదలకుండా కబ్జా చేసేశారు. గత వైసీపీ ప్రభుత్వం కబ్జాదారులకు స్వర్ణయుగంగా మారింది. రెవెన్యూ అధికారులు సర్వే చేసి అవి ప్రభుత్వ భూములు, వాటిని ఆక్రమించినా, నిర్మాణాలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డులు పెట్టినప్పటికీ కబ్జాదారులు వాటిని లెక్కచేయకుండా కబ్జా చేసేశారు. ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు దర్జాగా ఆక్రమిస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం కబ్జాదారుల కొమ్ము కాశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాయచోటి పట్టణం స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీనే కాకుండా అన్నమయ్య జిల్లా కేంద్రం కావడంతో రాయచోటి చుట్టుపక్కల భూములకు రెక్కలు వచ్చాయి. దీంతో గత ఐదేళ్లలో వైసీపీ నేతలు ఖాళీ జాగా కనపడితే చాలు కబ్జా చేయడం, ప్లాట్లు వేసి విక్రయించడం లాంటి పనులను విచ్చలవిడిగా చేపట్టారు. అప్పట్లో కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు కూడా అదే స్థాయిలో సహాయ, సహకారాలు అందించిన సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం మారినా రెవెన్యూ అధికారులు మాత్రం మారడం లేదని, ఇప్పటికీ వారు కొందరు కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల సుమారు పది కిలోమీటర్ల వరకు భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రంలో వాలిపోతుండడంతో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు మరింత ఊతమిచ్చినట్లు అయ్యింది. ఈ క్రమంలోనే కొంత మంది వైసీపీ నేతలు రాయచోటి పట్టణ పరిధిలో పలుచోట్ల వందలాది ఎకరాలను కబ్జా చేసి ప్లాట్లు వేసి విక్రయించడమే కాకుండా కొన్నిచోట్ల ఏకంగా నిర్మాణాలను కూడా పూర్తి చేశారు. ఇందులో భాగంగానే ప్రస్తుత ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధుల సహకారంతో పట్టణంలోని సుద్దలవాండ్లపల్లె రోడ్డులో గల అయ్యప్పస్వామి గుడి చుట్టుపక్కల ఎదురు భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా పట్టాలు పొంది రాయచోటి పట్టణానికి చెందిన వారు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారు దర్జాగా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు పూర్తి చేసినా రెవెన్యూ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల కాలంలో కూడా కొంతమంది అయ్యప్పస్వామి గుట్టకు సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలకు ఉపక్రమించడంతో అక్కడున్న స్థానికులు అడ్డుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇవే కాకుండా రాయచోటి మండల పరిధిలోని పెమ్మాడపల్లె గ్రామం వినాయకచెరువుకు సమీపంలో గరుగుపల్లికు వెళ్లే రోడ్డుకు తూర్పు వైపున సర్వే నెంబరు-356/2లో 2.97 ఎకరాలు, సర్వే నెంబరు-380లో 1.13 ఎకరాలతో పాటు మరో సర్వే నెంబర్‌లో రెండు ఎకరాల చొప్పున మొత్తం ఆరు ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని చెప్పి అక్కడ రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ స్థలం అంటూ రెండు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ వైసీపీకి చెందిన వసీవుల్లా అనే వ్యక్తి అందులో 2.94 ఎకరాలు కబ్జా చేసి దర్జాగా పొలం సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని గరుగుపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై గరుగుపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి స్పందనలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లకుండానే వెళ్లినట్లు, విచారించినట్లు చెబుతూ కబ్జాను తొలగించకుండా అక్కడ కంచె వేయకుండానే సమస్య పరిష్కరించామంటూ ఫిర్యాదుదారుడు చేత సంతకం చేయించుకునేందుకు బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే కాకుండా అక్కడ మరికొంత ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు ఫిర్యాదుదారుడు ఆంజనేయులు సెప్టెంబరు 30వ తేదీ స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ రెండు నెలలు గడుస్తున్నా నేటికీ రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం చూస్తే ప్రభుత్వం మారినా వైసీపీ కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

రాయచోటి పట్టణంలోని మదనపల్లి రోడ్డులో పీసీఆర్ కన్వెన్షన్ హాల్‌కు ఎదురుగా రోడ్డుకు తూర్పు భాగంలో కోట్లాది రూపాయల విలువ చేసే సుమారు 20సెంట్ల ప్రభుత్వ స్థలం వద్ద రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ స్థలం అంటూ బోర్డులు పెట్టినప్పటికీ నేడు మాత్రం ఆ బోర్డులు కనిపించడం లేదు. కోట్లాది రూపాయల విలువ చేసే ఆ ప్రభుత్వ స్థలంలో నేడు పునాదులు వెలుస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా చెప్పుకుంటూపోతే రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రభుత్వ భూముల కబ్జాలు చాంతాండంత లిస్టు తయారవుతుందనడంలో సందేహం లేదు. ఇటీవల మున్సిపల్ సమావేశంలో కూడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు పట్టణంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను, అక్రమ కట్టడాలను తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే అటు మున్సిపల్ అధికారులు, ఇటు రెవెన్యూ అధికారు లు విచ్చలవిడిగా జరుగుతున్న అక్రమ కట్టడాలు, భూముల కబ్జాలపై ఏ స్థాయిలో స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



రాయచోటి మండలం పెమ్మాడపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 380లో ఇది ప్రభుత్వ స్థలమని బోర్డు పెట్టిన రెవెన్యూ అధికారులు

రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు..

ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి సర్వేనెంబర్ 356/2లో 6 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, అక్కడ ఇది ప్రభుత్వ స్థలమని బోర్డులు పెట్టినప్పటికీ వైసీపీకి చెందిన వసివుల్లా అనే వ్యక్తి కబ్జా చేసి దర్జాగా పంటలు సాగు చేస్తున్నాడు. ఈ విషయంపై సెప్టెంబరు 30వ తేదీ స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు నేటికీ దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపి కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలి.

- ఇర్ల ఆంజనేయులు, గరుగుపల్లి

సర్వే చేస్తున్నాము..

భూకబ్జాలపై సర్వే చేస్తున్నాము. ప్రభుత్వ స్థలాలకు బోర్డులు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో రాళ్ల నాటి కంచె కూడా ఏర్పాటు చేస్తాము. సర్వే నెంబర్-356/2లో కూడా చేశాము. త్వరలోనే ఆ భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తాము. ప్రభుత్వ భూములు ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదు. ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటాము.

- పుల్లారెడ్డి, తహసీల్దార్

భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్

సంబేపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే రెవెన్యూ సదస్సుల కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం సంబేపల్లె మండలం మోటకట్లలో జరిగిన రెవెన్యూ సదస్సుకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో నూటికి 90 శాతానికిపైగా భూసమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా భూఆక్రమణలు, ఫ్రీహోల్డ్, మ్యుటేషన్, 22ఏ, డీకేటీ, సర్వే, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలపై వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను పూర్తిగా రద్దు చేసి రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు మేలు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీని తీసుకొని సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అధికారులు తీసుకున్న ప్రతి ఫిర్యాదుకు సంబంధిత అర్జీదారునికి రసీదు ఇచ్చి సమస్యను నిర్దీత సమయంలో పరిష్కరించాలన్నారు. వీలైనంతవరకు అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. మీభూమి-మీహక్కు పేరుతో ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు 33 రోజుల పాటు నిర్వహిస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో ఉన్న భూవివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇక నుంచి భూసమస్యలపై బాధితులు ప్రభుత్వం చుట్టూ తిరగడం కాదు. ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించాలన్నదే మీ భూమి, మీ హక్కు రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డ్వామా పీడీ వెంకటరత్నం, తహసీల్దార్ వెంకటేశ్, ఎంపీడీవో రామచంద్ర, ఏపీవో రెడ్డిజవహర్, మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, ఆర్ఎస్ డీటీ స్రవంతి, ఆర్ఐ రవిశంకర్, మాజీ సర్పంచులు గోపాల్, శశిధర్‌రెడ్డి, గిడ్డయ్య, బీజేపీ యువమోర్చా నాయకుడు రేపన శివప్రసాద్, టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, యువగళం సిద్దారెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, నందకిశోర్, సహదేవరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ తదితరులు

ఉపాధ్యాయుడి మృతిపై సీఎంవో ఆరా

- విద్యార్థులు కొట్టడంతోనే మృతి ?
- పోలీసుల అదుపులో నిందితులు
- ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణం కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్సు టీచర్ ఎజాజ్ అహ్మద్ అనుమానాస్పద మృతి సంఘటనపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీసినట్లు సమాచారం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో వివరాలు అడిగినట్లు తెలుస్తోంది. ఇటువంటి సంఘటన మరెక్కడా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, విచారణ త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ సంఘటనలో జిల్లా విద్యాశాఖాధికారులు ఇద్దరు ఉపాధ్యాయులను శుక్రవారం సాయంత్రం సస్పెండు చేసినట్లు సమాచారం. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్, ఇంగ్లీష్ టీచర్ వెంకట్రామిరెడ్డిలు సస్పెండు అయిన వారిలో ఉన్నట్లు తెలిసింది. పోలీసు, విద్యాశాఖాధికారుల విచారణలో మృతుడు ఎజాజ్‌ను విద్యార్థులు కొట్టినట్లు తేలినట్లు సమాచారం. సంఘటన జరిగిన రోజు మధ్యాహ్నం 3.30 గంటల విరామ సమయంలో నిందితుల్లో చిన్నవాడైన విద్యార్థితో అల్లరి చేసి మిగిలిన విద్యార్థులను ఇబ్బందిపెట్టవద్దని ఉపాధ్యాయుడు ఎజాజ్ హెచ్చరిస్తూ కొట్టినట్లు తెలిసింది. అదే సమయంలో అక్కడే ఉన్న నిందితుల్లో పెద్దవాడైన విద్యార్థి ఉపాధ్యాయుడిపైన దాడి చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడికి కంటి వద్ద గాయమైంది. తర్వాత పాఠశాలలోని ఉపాధ్యాయులు జోక్యం చేసుకుని పిల్లల తల్లిని పిలిపించి మందలించారు. ఉపాధ్యాయుడికి క్షమాపణ చెప్పించారు. పిల్లల క్షమాపణ తనకు వద్దన్న ఉపాధ్యాయుడు, అక్కడి నుంచి పక్కకు వెళ్లిపోయాడు. తర్వాత సుమారు 40 నిమిషాల తర్వాత ఉన్నఫళంగా ఆ ఉపాధ్యాయుడు కింద పడిపోయాడు. విద్యార్థి తనపై దాడి చేయడాన్ని జీర్ణించుకోలేక. మనోవేదనకు గురై ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు తెలిసింది. అయితే ఈ విషయాలను ప్రధానోపాధ్యాయుడు, ఇంగ్లీషు టీచర్ ఉన్నతాధికారులకు తెలియజేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై విచారించిన ఉన్నతాధికారులు వారిద్దరినీ సస్పెండ్ చేసినట్లు తెలిసింది. నిందితులిద్దరూ 14, 15 సంవత్సరాల వయస్సు బాలలు కావడంతో అధికారులు వీరిని జువైనల్ హోంకు తరలించనున్నట్లు తెలిసింది



అయ్యప్పస్వాములకు నచ్చచెబుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

దాడులకు యత్నించిన వారిని అరెస్టు చేయాలి

- అయ్యప్పస్వాముల ఆందోళన
- రెండు గంటల పాటు ఉద్రిక్తత
- ఇరువైపులా మోహరించిన ఇరువర్గాలు

9

- ఆందోళనకారులతో మాట్లాడిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- ఎట్టకేలకు సర్దుబాటు.. ఊపిరి పీల్చుకున్న జనం

పోలీసు శాఖలో హోంగార్డులు కీలకం

9



కడపకు తలమానికం శుభమస్తు షాపింగ్‌మాల్

- షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన సినీ నటి మీనాక్షి చౌదరి

కడప కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చీరలంటే తనకు చాలా ఇష్టమని ప్రముఖ తెలుగు సినీ నటి లక్కీభాస్కర్ సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి అన్నారు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లె సమీపంలోని మానస ఇన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శుభమస్తు షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి మీనాక్షి చౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. మీనాక్షి చౌదరిని చూడడానికి పెద్ద ఎత్తు న అభిమానులు తరలివచ్చారు. అభిమానుల హర్షధ్వానాల మధ్య షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్ యజమానులు శ్రీనివాసులు, బి.రవితో పాటు కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి హీరోయిన్‌కు బొకే అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హీరోయిన్ మాట్లాడుతూ కడపకు తలమానికంగా శుభమస్తు షాపింగ్‌మాల్ నిలుస్తుందన్నారు. షాపింగ్ మాల్ యజమానులు బి.శ్రీనివాసులు, బి.రవి మాట్లాడుతూ షాపింగ్‌మాల్ ఏర్పాటుతో స్థానికులకు సుమారు 320మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. ప్రజల ఆదరాభిమానాలతో కడపలో ప్రారంభించిన ఏడో షాపింగ్‌మాల్ అని తెలిపారు. ఇక్కడ రూ.99 నుంచి సుమారు రెండు లక్షల వరకు చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావున సామాన్య ప్రజలు మొదలు ఉన్నత వర్గాలకు చెందిన వారికి అనువైన ధరల్లో చీరలు, ఇతర అన్ని రకాల దుస్తులు లభిస్తాయన్నారు. హీరోయిన్ మీనాక్షి చౌదరితో పాటు జబర్దస్త్ కళాకారులు బుల్లెట్ భాస్కర్, ఫైమా, రమేశ్ తదితరులు హాజరై సందడి చేశారు. కార్యక్రమంలో అభిమానులతో పాటు నగర ప్రముఖులు పాల్గొన్నారు.



శుభమస్తు షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సినీ నటి మీనాక్షి చౌదరి.. షాపింగ్‌మాల్ యజమానులు శ్రీనివాసులు, రవి తదితరులు

స్నేహితుడి పెళ్లికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి
- డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం



మృతులు నరేష్‌కుమార్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి (ఫైల్‌ఫొటోలు)

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పెళ్లికి హాజరైన ఆ ముగ్గురు మిత్రులు అందరితో కలిసి సరదాగా గడిపారు. స్నేహితుడికి శుభాకాంక్షలు చెప్పి బైక్‌లో ముగ్గురూ కలిసి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో లారీని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన కురబలకోట మండలం అంగళ్లు పంచాయతీ అమ్మచెరువు మిట్ట సమీపంలో గురువారం తెల్లవారు జామున జరిగింది. ముదివేడు పోలీసుల కథనం మేరకు..అంగళ్లులో మిత్రుడి వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో మదనపల్లెకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బి.కొత్తకోట మండలం బండమీదపల్లెకు చెందిన నరేష్‌కుమార్‌రెడ్డి (26) సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, నీరుగట్టువారిపల్లె మాయాబజార్‌కు చెందిన దామోదర్‌రెడ్డి (25)కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా దామోదర్‌రెడ్డి మార్గమధ్యలో మృతి చెందాడు. మరో యువకుడు మహేంద్ర (20) ప్రమాదంలో గాయపడి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతి చెందిన యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా నరేశ్‌కుమార్‌రెడ్డి డిగ్రీ వరకు చదివి మగ్గం పని చేస్తున్నాడు. దామోదర్ రెడ్డి చికెన్ సెంటర్‌తో పాటు మగ్గం పనిచేస్తు న్నాడు. మహేంద్ర కూడా మగ్గం పని చేస్తు న్నాడు. ఇద్దరు యువకులు మృతి చెందడం తో మదనపల్లె జిల్లా ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ప్రతి ఒక్కరూ అయ్యో పాపం అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఇందులో నీరుగట్టువారిపల్లెకు చెందిన దామోదర్‌రెడ్డికి ఏడాది క్రితం వివాహం కాగా ఆరు నెలల కుమార్తె ఉంది. ఈ సంఘటనపై ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆస్పత్రి ఆవరణలో రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు

నేడు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రాజంపేటకు రాక

రాజంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నడింపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం రాజంపేటకు వస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట ఆర్టీసీ బస్టాండు ముఖద్వారంలో ఆర్టీసీ సంస్థ ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును మంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వై.కోట పాఠశాలలో పారిశుధ్య పనులు

ఓబులవారిపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వై.కోట గ్రామ పంచాయతీలో ఉన్న పాఠశాలలో పారిశుధ్య పనులు చేసినట్లు సర్పంచ్ ఈశ్వరయ్య తెలిపారు. పాఠశాల ఆవరణలో నీరు నిలవడంతో ఇబ్బందిగా ఉందని తెలియజేయడంతో ఇసుక మట్టి తరలించి చదును చేశామన్నారు. చెత్త చెదారం తొలగించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం

ఓబులవారిపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్దఓరంపాడు గ్రామ పంచాయతీలో ఉన్న జీవన జ్యోతి ఆనంద నిలయం ఆశ్రమంలో టీడీపీ యువ నాయకుడు పోలిన శివయ్య నాయుడు శుక్రవారం అన్నదానం చేశారు. . బోటుమీదపల్లెకు చెందిన శివయ్య నాయుడు, వెంకటేశ్‌నాయుడు తండ్రి వెంకటయ్య నాయుడు జ్ఞాపకార్థం ఆశ్రమంలో ఉన్న వృద్ధులు, వికలాంగులు, అనాథలకు అన్నదానం చేసినట్లు ఆశ్రమ ఛైర్మన్ పాణ్యం సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

రాజంపేట: పట్టణంలోని మన్నూరు గ్రామంలో ఇడిమడకల సుబ్రమణ్యం 30వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు రాష్ట్ర టీడీపీ బీసీ నాయకుడు ఇడిమడకల కుమార్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. జిల్లా టీడీపీ కార్యదర్శి టి.సంజీవరావు, మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు డీఆర్‌ఎల్ మణి, స్థానిక టీడీపీ నాయకులు వజ్రం నరసింహులు, శ్రీనివాసులు, మల్లికార్జున, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌తో మేడా విజయశేఖర్‌రెడ్డి భేటీ



నారా లోకేష్‌తో భేటీ మేడా విజయశేఖర్‌రెడ్డి,

రాజంపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. రాజంపేట టీడీపీలో అనిశ్చిత పరిస్థితిని పరిష్కరించాలని, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. త్వరలో రాజంపేట సమస్యలు పరిష్కరిస్తామని లోకేశ్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

సంబేపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లె గ్రామం తిమ్మక్కగారిపల్లెకు చెందిన నరసింహారెడ్డి పది రోజులుగా కనిపించడం లేదని, ఆయన సోదరుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నరసింహారెడ్డికి మతిస్థిమితం లేదని, ఆచూకీ తెలిసిన వారు సంబేపల్లె పోలీస్‌స్టేషన్‌కు గానీ, 9652702050 నెంబరుకు గానీ ఫోన్ చేసి సమాచారం అందజేయాలని కోరారు.

హంగులన్నీ ఉన్నా.. నిరుపయోగంగా..

● అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా హాస్టల్ భవనాలు ● పట్టించుకోని అధికారులు

పుల్లంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలను వినియోగించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. తొమ్మిదేళ్లుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

పుల్లంపేట మండల కేంద్రానికి ఫర్లాంగు దూరంలో బీసీ బాయ్స్ హాస్టల్, ఎస్సీ బాయ్స్ హాస్టళ్ల భవనాలు ఉన్నాయి. 2015 వరకు ఈ భవనాల్లో వందలాది మంది విద్యార్థులు వసతి పొందేవారు. ఒక్కొక్క హాస్టల్ సుమారు ఎకరంపైన విస్తీర్ణంలో ఉండగా, విద్యార్థులు ఉండేందుకు పక్కా భవనాలు ఉన్నాయి. చుట్టూ ప్రహరీగోడ కూడా ఉంది. ఒక్కో భవనంలో 12 గదులు వరకు ఉన్నాయి. వంటశాల కూడా ప్రత్యేకంగా ఉంది. తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం ఉంది. ఈ రెండు భవనాలూ ప్రధాన రహదారికి పక్కనే ఉన్నాయి. ఈ హాస్టల్ భవనాల్లో ఎప్పుడో వేసిన చేతిబోరు నుంచి కూడా ఇప్పటికీ నీరు వస్తున్నాయి. అప్పట్లో తెలుగుదేశం ప్రభుత్వం కొత్త భవనాలు నిర్మించడంతో విద్యార్థులందరిని కొత్త భవనంలోకి మార్చారు. దీంతో నిరుపయోగంగా మారిన ఈ భవనాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు అప్పటి టీడీపీ నాయకులు కృషి చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఆ పనులు పక్కనపడిపోయాయి. అప్పటి నుంచి నేటి వరకు ఈ రెండు హాస్టళ్ల భవనాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. వాటి ఆవరణలో చెట్లు పెరిగిపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు ఈ హాస్టల్ భవనాలు అడ్డాగా మారాయి. ప్రతిరోజు ఈ భవనాల్లో మద్యం సేవిస్తూ ఉంటారు. ఇతరత్రా అసాంఘిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని హంగులు ఉన్న ఈ ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకోకముందే వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న బీసీ బాయ్స్ హాస్టల్ (ఇన్‌సర్ట్) నిర్లక్ష్యానికి గురవుతున్న ఎస్సీ హాస్టల్ భవనం

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నందలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. మండలంలోని పాటూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుల్లో కోర్టు కేసులు, మ్యుటేషన్, నదులు, చెరువులు, కాలువ ఆక్రమణలతో పాటు భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎటువంటి రుసుం తీసుకోకుండా అన్ని రెవెన్యూ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు. గ్రామ సర్పంచ్ అక్కిరెడ్డి స్వరూపారెడ్డి, అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, శ్రీను, వెల్ఫేర్ ఆఫీసర్ ముజీబ్‌బాషా, తహసీల్దారు అమర్‌నాథ్, పంచాయతీ సెక్రటరీ మమత, జూనియర్ అసిస్టెంట్ సిద్దిక్, మండల సర్వేయర్ ప్రభాకర్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట మండలంలోని తాళ్లపాక, ఎంజీపురం గ్రామాల్లో తహసీల్దారు పీర్‌మున్నీ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదసుల్లో జేసీ ప్రజలనుంచి వినతిపత్రాలు స్వీకరించి, పరిష్కార మార్గాలను సూచించారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లె ప్రతాప్‌రాజు తదితరులు అందజేసిన అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సహదేవరెడ్డి, గ్రామ సర్పంచ్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: మండలం లోని ఓబనపల్లె పంచాయతీలో జిల్లా పర్యాటక శాఖ అధికారి, రైల్వేకోడూరు మండల నోడల్ అధికారి ఎం. నాగభూషణం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహబూబ్‌చాంద్ మాట్లాడుతూ ఎక్కువగా భూ సర్వేపై వినతిపత్రాలు అందాయని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాజంపేట డివిజన్ సర్వే అధికారి గురవయ్య ఆర్ఐ లక్ష్మీదేవి, సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు కస్తూరి చంద్రశేఖర్, రైతులు, రెవెన్యూశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

పుల్లంపేట: మండల పరిధిలోని దళవాయిపల్లెలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 57 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు అరవింద్ కిషోర్ తెలిపారు. అందులో రేషన్‌కార్డులకు 38, పక్కా గృహ నిర్మాణాలకు 7, పెన్షన్ల కోసం 3, రెవెన్యూకు సంబంధించి 9 అర్జీలు ఉన్నట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ సదస్సును నోడల్ ఆఫీసర్ కృష్ణారావు పర్యవేక్షించారు.

ఓబులవారిపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోవిందపల్లెలో సుమారు 40 దరఖాస్తులందాయని తహసీల్దారు శ్రీధర్‌రావుతెలిపారు.

చిట్వేలి : రాజుగుంట రైతుసేవా కార్యాలయంలో తహసీల్దారు మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రేషన్‌కార్డులు, పింఛన్లు, రెవెన్యూ సమస్యలపై 65 వినతులు అందాయి. ఇందులో కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రత్యేక అధికారి గురుప్రకాష్ తెలియజేశారు.సర్పంచ్ గుత్తి నరసింహ పాల్గొన్నారు

అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

సామాజిక తనిఖీల్లో రూ.11వేలు రికవరీ



సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ నాగరత్నమ్మ

సిద్దవటం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 2023-24లో ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ నాగరత్నమ్మ టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ ప్రవర్తనపై మండిపడ్డారు. మస్టర్‌లో కూలీల నుంచి ఎప్పటికప్పుడు సంతకాలు తీసుకోవాలని, పనులు కల్పించేటప్పుడు కూలీల ఫొటోలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఏపీవో నరసింహులు మాట్లాడుతూ మండలంలో 4,70,32,000 రూపాయలు చెల్లింపులు జరిగాయని, మస్టర్, కొలతల్లో తేడా ఉండంతో 11,073 రూపాయలు రికవరీ చేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రామలింగారెడ్డి, ఏపీడీ సోమేశ్వర్‌రెడ్డి, ఏవో నరసింహులు, శివశంకర్‌రెడ్డి, శైలజా, పంచాయతి సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటు చేయాలి

సుండుపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని పెద్దబలిజపల్లెలో పొలాలకు, కాటమరాజు గుడి వద్దకు వెళ్లేందుకు రోడ్డు వసతి కల్పించాలని జనసేన నాయకుడు రామాశ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఏపీవో మాలిక్‌బాషాతో కలిసి ఆ రోడ్డును పరిశీలించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు నంద్యాల రామయ్య, ఈసీ హారూన్‌బాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోమశిల పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఒంటిమిట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సోమశిల పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ టి.బాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిదిలోని పెన్న పేరూరు గ్రామాన్ని ఆయన పరిశీలించారు. సోమశిలలో నీటి నిల్వలు పెంచడంతో పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెన్నపేరూరు నుంచి ఇబ్రహీంపేటకు వెళ్లేదారి నీట మునిగిందని, ఈ మార్గంలో ఎవరూ వెళ్లరాదని సూచించారు. గ్రామాల్లో నిల్వ ఉన్న నీటి ద్వారా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ముందస్తు చర్యలుగా మందులు వాడుకోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు గజేంద్రసింహారెడి పాల్గొన్నారు.

నేడు తల్లిదండ్రుల సమావేశం

రామాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం ఉదయం 9 గంటలకు తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల చదువులు, వివిధ అంశాలపైన పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలపై ఉపాధ్యాయులతో చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి తప్పకుండా తల్లిదండ్రులు హాజరుకావాలని ఆమె కోరారు.

పెనగలూరు: మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్‌డేను విజయవంతం చేయాలని ఎంఈవో-1 గిరివరదయ్య, ఎంఈవో-2 టి.నాగసుబ్బరాయుడు పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను ఈ సమావేశానికి ఆహ్వానించి పాఠశాల స్థితిగతులు, అభివృద్ధి, విద్యార్థి నడవడిక, క్రమశిక్షణ భవిష్యత్‌లో తీసుకోవాల్సిన కార్యాచరణ తదితర విషయాలన్నింటిని తల్లిదండ్రులకు వివరిస్తామన్నారు.

తిరుమల మహా పాదయాత్ర ప్రారంభం



తిరుమల పాదయాత్రలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తిరుమల మహా పాదయాత్రను రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఉదయం ఆకేపాడులోని టీటీడీ కల్యాణమండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. పండరిభజన, కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తిరుమల మహా పాదయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, మైదుకూరుకు చెందిన రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి తదిత రులు పాల్గొన్నారు. రాజంపేటలో ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డికి శాలు వాలు, గజమాలలతో స్వాగతించారు. మన్నూరు సీఐ మహ్మద్ అలీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాదయాత్రలో పాల్గొనే వారికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో ఆకేపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అశ్వినిచంద్, అబ్బిశెట్టి బ్రహ్మేంద్ర ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లెను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలుగు దేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు తెలిపారు. శుక్రవారం వీరబల్లి మండలంలోని దిగువరాచపల్లి, వంగిమళ్ల గ్రామ పంచాయతీల్లో రూ.25 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులకు ఆయన బీజేపీ, జనసేన నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్ రాజు, నాయకులు రెడ్డెప్పరెడ్డి, ఎంపీడీవో నూర్జహాన్, ఏతాలు నాగూర్‌మీరా, ఇర్ఫాన్, సొసైటీ ప్రెసిడెంట్ రాంమోహన్‌రెడ్డి, కార్యదర్శి సురేంద్ర, గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్‌రాజు, చిన్నమల్లయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రైల్వేకార్మిక సంఘ గుర్తింపు ఎన్నికలు

నందలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రైల్వే కార్మిక సంఘ గుర్తింపు ఎన్నికలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ఎన్నికల్లో 391 మంది ఓటు వేయాల్సి ఉండగా 347 మంది తమ ఓటుహక్కును వినియోగించుకొన్నారు. ఈ బ్యాలెట్ బాక్సులను గుంతకల్‌కు తరలించనున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

సంబేపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మోటకట్లలో ఆయన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి సమస్య పరిష్కారంలో భాగంగా బోర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 170 బోర్లు వేసి మోటార్ బిగించి గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికి నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గోపాల్, గిడ్డయ్య, యువగళం సిద్దారెడ్డి, సహదేవ నాయుడు, భాస్కర్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ నిర్మాతకు నివాళి



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కె.కె.చౌదరి

రైల్వేకోడూరు(రూరల్) డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి శాఖ ఛైర్మన్ కె.కె.చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, వార్డు సభ్యులు పోతురాజు నవీన్, మైనారిటీ సీనియర్ నాయకులు పఠాన్ అల్లాబకష్(మౌలా), రాజంపేట పార్లమెంట్ టీడీపీకార్యవర్గ సభ్యులు పూలెల రమేష్ పాల్గొన్నారు.

స్టార్టప్‌లతో ఉన్నత స్థానానికి చేరుకోవాలి

రాజంపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కృషి, పట్టుదలతో స్టార్టప్‌లు స్థాపించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సూచించారు. రాజంపేట పాలిటెక్నికల్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పాలీఫెస్ట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప, అన్నమయ్య జిల్లాల్లోని 32 పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో 39 ప్రాజెక్టులు ప్రదర్శించారన్నారు. వీటిలో 20 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయన్నారు. ఆయా ప్రాజెక్టుల్లో ప్రథమ స్థానంలో నిలచిన విద్యార్థికి రూ. 25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 10 వేలు నగదు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటుపై వివాదం



పగిలిపోయిన పైప్‌లైన్

రైల్వేకోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరెంటు పోల్ ఏర్పాటు విషయంలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడంతో విద్యుత్ శాఖ అధికారులు ఇబ్బందులెదుర్కొన్నారు. పట్టణంలోని గాంధీ నగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదని మైనార్టీ నాయకుడు ముజీబ్ విద్యుత్ అధికారులకు విన్నవించాడు. దీంతో రైల్వే స్టేషన్ మార్గంలోని ఓ బ్యాంకు పక్కనే విద్యుత్ స్తంభం ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఆ ప్రాంతంలో తాగునీటి పైప్‌లైన్ ఉందని చెప్పినా వినకుండా డ్రిల్లింగ్ చేయించడంతో పైప్ లైన్ పగిలిపోయింది. దీంతో శివరాజు అనే వ్యక్తి వాగ్వాదానికి దిగాడు. పనులు చేయాల్సిందే నని మైనార్టీ నాయకుడు భీష్మించడం, అవతలి వర్గంవారు రాజకీయ నాయకుల నుంచి పదేపదే ఫోన్లు చేయించడంతో అధికారులు పనులు నిలిపివేశారు.

కడప - చెన్నై రహదారిలో గుంతలు పూడ్చివేత



జాతీయ రహదారిపై ఉన్న గుంతను పూడుస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై రహదారిలోని అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద ఏర్పడ్డ భారీ గుంతలను శుక్రవారం బీజేపీ నాయకులు పూడ్చివేశారు. ఈ గుంత వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా మారడంతో కంకర, ఇసుక, మట్టితో పూడ్చివేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు రమేష్‌నాయుడు, తోట నగేష్, పాపయ్య, హరి, నవీన్‌కుమార్, రమణ, శ్రీనివాసులు, సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):నరసారావుపేట ఫార్మసీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు రాజంపేట అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో కళాశాల వైస్‌ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన విద్యార్థుల బృందంతోపాటు, పరుగు, లాంగ్‌జంప్‌లో ప్రథమ, తృతీయ బహుమతులు సాధించిన గణేశ్ అనే విద్యార్థికి ప్రోత్సాహక బహుమతులు, మెమెంటోలు అందజేశారు. స్పోర్ట్స్ ఇన్‌చార్జి మధు, అశోక్ పాల్గొన్నారు.

దళవాయిపల్లె పాఠశాలలో పేపర్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్

పుల్లంపేట,. డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దళవాయిపల్లె పాఠశాలలో శుక్రవారం పేపర్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. మండలంలో శనివారం నిర్వహించే మెగా పేరెంట్స్ మీటింగ్‌ను పురస్కరించుకుని విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పేపర్‌తో తయారు చేసిన వివిధ రకాల వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శనను నోడల్ ఆఫీసర్ కృష్ణారావు, తహసీల్దారు అరవింద్‌కిషోర్ పరిశీలించి విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున, రమణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ఓబులవారిపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వేధిస్తున్న అనారోగ్యం, వర్షం కారణంగా ఇంటి పైకప్పు దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతున్న అయ్యలరాజుపల్లె హరిజనవాడకు చెందిన దాసరి సుబ్రమణ్యంకు మండల పాత్రికేయుల ఆధ్వర్యంలో పాణ్యం చిన్నయ్య, బియ్యాల రమణ శుక్రవారం బస్తా బియ్యరం, నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి ఇల్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. కాంగ్రెస్‌నాయకులు డాక్టర్ దాసరి సుబ్రమణ్యం, నరసింహులు పాల్గొన్నారు.

చెరువుకు నీరు తరలించే పనులు ప్రారంభం



కాలువ పనులు చేస్తున్న దృశ్యం

నందలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటూరు చెరువుకు చెయ్యేరు నుంచి నీరు తరలించే పనులను శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎక్స్‌కవేటర్‌తో ఎగువ కాలువలో పూడిక తీస్తున్నారు. కన్యక చెరువుకు కూడా నీరందించే పనులు చేయాలని నాగిరెడ్డిపల్లె, నందలూరు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

దాడులకు యత్నించిన వారిని అరెస్టు చేయాలి

- అయ్యప్పస్వాముల ఆందోళన
- రెండు గంటల పాటు ఉద్రిక్తత
- ఇరువైపులా మోహరించిన ఇరువర్గాలు
- ఆందోళనకారులతో మాట్లాడిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- ఎట్టకేలకు సర్దుబాటు.. ఊపిరి పీల్చుకున్న జనం

రాయచోటి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వాముల గ్రామోత్సవం సందర్భంగా గురువారం రాత్రి పట్టణంలో జరిగిన వివాదం నేపథ్యంలో.. శుక్రవారం ఉదయం పట్టణంలో అయ్యప్పస్వాములు ఆందోళనకు దిగారు. శాంతియుతంగా గ్రామోత్సవం చేస్తున్న తమను అడ్డుకుని.. దాడి చేయడానికి యత్నించిన వారిపై కేసులు నమోదు చేసి.. అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ.. పెద్దఎత్తున అయ్యప్పస్వాములు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్‌ఎన్ కాలనీలోని శివనంది సర్కిల్ నుంచి నేతాజి సర్కిల్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అయితే గురువారం రాత్రి రాణా సర్కిల్‌లో ఓ వర్గం ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడి ఆందోళనకు దిగడంతో.. ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో..పోలీసులు ఈ ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వందల సంఖ్యలో అయ్యప్పస్వాములు ఉండడంతో పోలీసులు వారిని నిలువరించలేకపోయారు. పరిస్థితి అదుపు తప్పుతుందనే అనుమానంతో వందలాది మంది పోలీసులను ఉన్నతాధికారులు రప్పించారు. రాజధాని హోటల్ ఎదురుగా రోడ్డుపైన ఆందోళన చేస్తున్న అయ్యప్పస్వాములను పోలీసులు అడ్డుకున్నా వారిని తోసుకుని నేతాజీసర్కిల్‌కు చేరుకుని అక్కడ రోడ్డుపైన బైఠాయించి ఆందోళన చేశారు. రాత్రి తమను అడ్డుకున్న ప్రాంతంలోకి ఇప్పుడు వెళ్తామని అయ్యప్పస్వాములు పట్టుబట్టారు. రాయచోటి అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ చంద్రశేఖర్ తదితరులు ఆందోళనకారులకు నచ్చజెప్పేందుకు యత్నించినా వారు ఆందోళనను కొనసాగించారు. ఇదే సమయంలో అటువైపు మరో వర్గానికి చెందిన వాళ్లు కూడా పెద్ద సంఖ్యలో గుమికూడి నినాదాలు చేశారు. దీంతో ఒకసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరువర్గాలు పోలీసుల మాట వినకపోవడంతో.. గొడవ పెద్దదవుతుందేమోనని అందరూ ఆందోళన చెందారు. ఈ సమయంలో ఆందోళనకారుల వద్దకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వచ్చి సర్దిచెప్పారు. రాయచోటి పట్టణంలో హిందూ, ముస్లింలు సోదరభావంతో జీవించాలని ఆయన కోరారు.


ఆందోళన చేస్తున్న అయ్యప్పస్వాములను అడ్డుకుంటున్న పోలీసులు

రాయచోటి ప్రజల ప్రశాంత జీవనాన్ని దృష్టిలో పెట్టుకుని ఆందోళన విరమించాలని సూచించడంతో ఎట్టకేలకు ఆందోళనకారులు ఆందోళన విరమించారు. మరోవైపు గుమికూడిన ఇంకో వర్గం ప్రజలను అదే వర్గానికి చెందిన పలువురు పెద్దమనుషులు, యువకులు శాంతింప చేసి అక్కడి నుంచి పంపించేశారు. దీంతో సుమారు రెండు గంటల పాటు సాగిన ఆందోళన సద్దుమణిగింది. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి రాణా సర్కిల్‌లో పర్యటించి.. పోలీసు ఉన్నతాధికారులకు పలు సూచనలు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందిని రాయచోటికి తరలించారు. సున్నితమైన ప్రాంతాలలో పోలీసులను మోహరించారు. రాయచోటి పట్టణాన్ని పోలీసులు తమ గుప్పిట్లోకి తీసుకున్నారు.

వైవీయూలో విభాగాల అధిపతుల నియామకం

కడప ఎర్రముక్కపల్లె డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో పలు విభాగాల అధిపతులను నియమిస్తూ రిజిస్ట్రారు ప్రొఫెసరు పుత్తా పద్మ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 డిసెంబరు 4 వరకు విధుల్లో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో పనిచేసిన వారి పదవీ కాలం పూర్తి కావడంతో నూతన నియామకాలు చేపట్టామన్నారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్ (ఎర్త్‌సైన్స్), డాక్టర్ రామక్రిష్ణ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్‌ఫర్‌మేటిక్, డాక్టర్ చంద్రశేఖర్ పర్యావరణ శాస్త్రం, డాక్టర్ మునికుమారి జెనెటిక్ అండ్ జనోమిక్, డాక్టర్ ఎన్.సుభాష్ చంద్ర మైక్రోబయాలజీ, డాక్టర్ లాజర్ మనస్తత్వ శాస్త్రం, డాక్టర్ ప్రమీలా మార్గరేట్ పొలిటికల్ సైన్స్‌అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ప్రొఫెసరు ఎంఎం వినోదిని తెలుగు, ప్రొఫెసరు శ్రీనివాసులు ఆర్థికశాస్త్రం, డాక్టర్ ఎస్వీ వెంకటరమణ జంతు శాస్త్రం, డాక్టర్ సునీత భూగర్భశాస్త్రం, డాక్టర్ సి.సరిత బిజినెస్ మేనేజ్‌మెంటు, కె.మృత్యుంజయరావు ఫైన్‌ఆర్ట్స్, డాక్టర్ టి.శ్యాంస్వరూప్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్, డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్‌గా నియమితులయ్యారు.

ఉద్యాన సమగ్ర పథకానికి రూ.18.13 కోట్లు మంజూరు

కడప ఎన్జీఓఆర్ సర్కిల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ఉద్యాన సమగ్ర పథకం కింద రూ.18.13 కోట్లు మంజూరైనట్లు జిల్లా ఉద్యాన అధికారి ఎస్.సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్, శీతల గిడ్డంగులు, శీతల గదులు, రెపనింగ్ ఛాంబరు, ఉల్లి నిల్వ గోదాములు, కలెక్షన్ సెంటరులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారానికి మండలాల్లోని ఉద్యానశాఖ అధికారులను, కలెక్టరేట్‌లోని ఓ బ్లాక్‌లో ఉన్న తమ కార్యాలయంలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యుత్ సమస్యలపై ఏకరువు

- ప్రత్యేక విద్యుత్తు అదాలత్ చైర్‌పర్సన్ ఎదుట ఆవేదన


వినియోగదారుల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీనివాస ఆంజనేయమూర్తి

జమ్మలమడుగు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు విద్యుత్తు సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రత్యేక విద్యుత్తు అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రత్యేక విద్యుత్తు అదాలత్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి మాట్లాడుతూ జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సమస్యలున్నవారు నేరుగా చెప్పడం లేదా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని వినియోగదారులకు సూచించారు. ఈ మేరకు జమ్మలమడుగు పట్టణంలోని ఓ ఇంటి యజమాని గత 13 సంవత్సరాలుగా తన ఇంటికి సంబంధించి పెండింగ్ కరెంటు బిల్లు రూ.1.35 లక్షలు ఉందని.. తగ్గిస్తే బిల్లు కడుతానని తెలిపారు. ఇందుకు చైర్‌పర్సన్‌తో పాటు కమిటీ సభ్యులు బిల్లులను తగ్గించేది లేదని, వాయిదాల పద్ధతిలో కట్టవచ్చని చెప్పారు. అలాగే జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల పరిధిలోని పలువురు తమ తమ సమస్యలను నేరుగా చెప్పారు. మరికొందరు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జమ్మలమడుగు పట్టణంలోని మున్సిపాలిటీకి సంబంధించి వాటర్‌ప్లాంట్లకు సుమారు కోటి రూపాయల వరకు బకాయిలు ఉంటాయని.. ఇంతవరకు వారిని ఎవరు అడగడం లేదన్నారు. కేవలం చిన్న చిన్న ఇబ్బందులతో బిల్లులు కట్టలేని పేద ప్రజలకు మాత్రమే బిల్లులు కట్టాలని ఒత్తిడి చేయడం దారుణమన్నారు. ఆర్థిక సభ్యుడు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, డీఈ రాజగోపాల్, ఏఈలు, కిందిస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

520 బియ్యం బస్తాల లారీ పట్టివేత



మైదుకూరు రూరల్, డిసెంబ రు 6 (ఆంధ్రజ్యోతి): అక్ర మంగా రవాణా చేస్తున్న బియ్యం లారీని మైదుకూ రులోని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసు కున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శివ శంకర్ సమాచారం మేరకు.. జమ్మలమడుగు నుంచి చెన్న య్‌కి వెళుతున్న బియ్యం లారీని మైదుకూరులో పోలీ సులు అదుపులోకి తీసుకొని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అటాచ్ చేశారు. లారీలో 520 బస్తాల బియ్యం ఉండగా.. వీటి విలువ సుమారు రూ.10లక్షల 79 వేలు ఉంటుందని తెలిపారు. సీజ్ చేసిన బియ్యం బస్తాలను గోడౌన్‌కు తరలించినట్లు శివశంకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ 108 వాహన పైలెట్ మృతి

రామాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 108 వాహనం పైలెట్ సంగటి రమేశ్‌బాబు (35) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వైఎస్‌ఆర్ జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లయపల్లె రవీంద్రనగర్ వాసి రమేశ్‌బాబు మొలకలచెరువులో 108 వాహనం పైలెట్‌గా పనిచేస్తున్నాడు. కడపలో 108 వాహనం మరమ్మత్తులు చేయించుకుని తిరిగి మొలకలచెరువుకు వస్తుండగా గురువారం రాత్రి గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇరువురి మధ్య ఘర్షణ- ఒకరిమృతి


రామాంజనేయులు మృతదేహం

చక్రాయపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికొవ్వూరు గ్రామం దళితవాడలో శుక్రవారం సాయంత్రం మురుగునీరు వస్తున్నాయని ఘర్షణకు దిగడంతో దండు రామాంజనేయులు (36) మృతిచెందాడు. దండు రామాంజనేయులు భార్య శివలక్ష్మి ఫిర్యాదు మేరకు చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళితే.. బట్టలు ఉతికేనీళ్లు ఇంటి ముందు పోతున్నాయని నాగార్జున, రామాంజనేయులు గొడవకు దిగారు. దీంతో రామాంజనేయులు నాగార్జున చెల్లెలను కొట్టడంతో నాగార్జున కోపంతో రామాంజనేయులును కట్టెతో కొట్టడంతో మృతిచెందినట్లు తెలిపారు. నాగార్జున పరారీలో ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

అట్లూరులో పట్టపగలే ఇంటిలో చోరీ

- రూ.2లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు అపహరణ

అట్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఎగువపల్లి కాలనీకి చెందిన లక్షుమ్మ ఇంటిలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పట్టపగలే ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న సుమారు రూ.2లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఎస్‌ఐ రామక్రిష్ణ వివరాల మేరకు... బాధితురాలు లక్షుమ్మ, కుమారుడు కొండయ్య ఉదయం 11గంటల సమయంలో బద్వేలుకు వెళ్లి తిరిగి 2గంటల సమయానికి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడం గమనించి.. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారు అభరణాలను చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బద్వేలు సీఐ నాగభూషణ్, గోపవరం ఎస్‌ఐ శ్రీకాంత్ సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. చుట్టుపక్కల వారిని విచారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నాగభూషణం తెలిపారు.

జీవో 145కు రద్దు చేయండి

- కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన


విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం జరగాల్సిన క్రిమినల్ కేసులు ఇక్కడ జరిగే అవకాశం లేకుండా తీసుకొచ్చిన జీవో 145ను వెంటనే రద్దు చే యాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. శుక్రవారం న్యాయవా దులు విధులు బహిష్కరించి రాయచోటి కోర్టు ఎదుట నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్య, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు మా ట్లాడుతూ జీవో 145 వలన రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కూడా భవిష్యత్తులో ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నమోదయ్యే కేసులు ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే అవకాశం లేకుండా పోతుందన్నారు. రాయలసీమ జిల్లాల మొత్తానికి తిరుపతి కేంద్రంగా ఒకే ఒక కోర్టు ఉం టుందని, కోస్తా ప్రాంతంలో నాలుగు కోర్టులు మాత్రమే పనిచేస్తాయని, దీనివలన కక్షిదారులు సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సి వస్తుందని వారికి ఆర్థికంగా భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ముంగిట్లోకి న్యాయం చేరేలా న్యాయవ్యవస్థ అభివృద్ధి కావాలని దేశ అత్యున్నత న్యాయస్థానం చెబుతు న్నప్పటికీ ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా జీవో 145 తెచ్చి ప్రజలకు న్యాయవ్యవస్థను దూరం చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి నాగముని, భార త న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షుడు టి.ఈశ్వర్, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, రాజమనోహర్, ధనుంజయకుమార్, రామాంజులు, రవిశంకర్, తాహీర్, నాగమల్లు, వీరభద్రయ్య, కుసుమ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ఎజాజ్ మృతి బాధాకరం : మంత్రి


మంత్రి నారాలోకేశ్‌తో ఫోనులో మాట్లాడుతున్న ఆజాజ్ అహ్మద్ కుటుంబ సభ్యులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఎజాజ్ ఆకస్మిక మృతి బాధాకరమని, ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తుందని రాష్ట్రరవాణా క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కడప నగరంలోని మృతుడు నివాసంలో ఎజాజ్ కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి ..కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆకతాయి చేష్టలు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడి ప్రాణాలు కోల్పోవడానికి కారణం కావడం బాధాకరమన్నారు. ఈసంఘటనపై సీఎం సీరియస్‌గా ఉన్నారన్నారు. ఎజాజ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉందని, అతని మృతికి గల కారణాలపై సమగ్రంగా విచారణ చేపట్టి తెలుసుకుంటామన్నారు. ఒక మంచి ఉపాధ్యాయుని కోల్పోయిందని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని.. వారి కుటుంబ సభ్యులకు ఓదార్పును, తమ ప్రగాఢ సానుభూతి తెలుపుకుంటున్నామని అన్నారు. ఈసందర్భంగా విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ ఫోను చేసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

ఎస్టీయూ వినతి : ఎజాజ్ అహ్మద్ కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా రాష్ట్ర నాయకులు బాలగంగారెడ్డి కోరారు. శుక్రవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఎస్టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఎస్టీయూ నాయకులు సాదిక్‌ఆలీ, సంజీవరాయుడు, జబీబుల్లా ఖాన్, ఫకృద్దీన్, ఖాజామొయినుద్దీన్, ఫయాజ్ పాల్గొన్నారు.

స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు రోల్ మోడల్‌గా ఉండాలి


శిక్షణ కార్యక్రమానికి హాజరైన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు

రాయచోటిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించి రోల్ మోడల్‌గా నిలవాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. శుక్రవారం గాలివీడు రోడ్డులోని అర్చనా కళాశాలలో స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్ అండ్ గైడ్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులు, గురువులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ సమాజంపై బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సమకూరుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఆన్ ఎయిడెడ్ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సమకూర్చేందుకు, భవన నిర్మాణానికి కృషి చేయాలని స్కౌట్ అధికారులు మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో అర్చనా విద్యాసంస్థల కరస్పాండెంట్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మౌలాలి, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, స్కౌట్ అధికారులు, వివిధ మండలాల నుంచి శిక్షణకు వచ్చిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో హైనా కలకలం


ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

లింగాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లింగాలలో శుక్రవారం ఉదయం హైనా కలకలం రేగింది. గ్రామానికి చెందిన బయన్న ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఉదయం ఇంటి నుంచి బయటకు రాగానే ఎదురుగా ఉన్న హైనా పరుగులు తీసింది. పులిపిల్లగా భావించి అందరికి పులిపిల్లను చూశానని తెలిపాడు. సమాచారం అందుకున్న ముద్దనూరు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు సంఘటన స్థలంలోని పాదముద్రలు పరిశీలించి హైనాగా గుర్తించారు. ఆయన మాట్లాడుతూ హైనా కుక్క జాతికి చెందినమాంసాహార జంతువు అని తెలిపారు. దీంతో మనుషులకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. చిన్న పిల్లల పట్ల కాస్త అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కర్ణపాపాయపల్లెలో కూడా గురువారం పొలంలో కనిపించిన జంతువు హైనాగా గుర్తించారు.

పోలీసుల అదుపులో పాల వ్యాపారి....?

కడప(క్రైం)డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాత కడపకు చెందిన పాల వ్యాపారిని రిమ్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. రామంజనేయపురానికి చెందిన మహిళకు, అలాగే కాగితాలపెంట ప్రాంతానికి చెందిన మరో మహిళకు పాలు పోస్తుంటాడు. ఒక మహిళకు తెలియకుండా మరో మహిళకు వారి ఫొటోలు వాట్సాప్ ద్వారా పంపించాడు. రామాంజనేయపురానికి చెందిన మహిళ ఫొటోలు తీస్తుండగా.. ఆమె తన ఫొటోలు ఎందుకు తీస్తున్నావంటూ పాలవ్యాపారిని నిలదీసినట్లు సమాచారం. ఆమె సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాల వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

అప్పు చెల్లించలేదని.. వ్యక్తిని కిడ్నాప్ చేసిన వ్యాపారి

కడప(క్రైం), డిసెంబరు 6: కడప నగరం ఎన్జీవో కాలనీకి చెందిన ఓ వ్యక్తి వేంపల్లెకు చెందిన వ్యాపారి వద్ద లక్షల్లో అప్పు తీసుకున్నట్లు తెలిసింది. ఈ అప్పు చెల్లించ కపోవడంతో శుక్రవారం ఆ వ్యాపారి కడపలోని అప్పు తీసుకున్న వ్యక్తి ఇంటికి రాత్రి వచ్చి కారులో బలవంతంగా తీసుకెళ్లినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఈ విషయంపై చిన్నచౌకు పోలీసులను వివరణ అడుగగా... ఈ విషయం తమ దృష్టికి రాలేదని, ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు కీలకం


హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో హోంగార్డ్స్ సేవలు కీలకంగా మారాయని అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలిపారు. హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 322 మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తుండగా అందులో పురుషులు 303 మంది, మహిళలు 19 మంది ఉన్నారని, పోలీసుశాఖకు వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. పోలీసులతో సమానంగా హోంగార్డులు సేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు. హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో కీలకంగా మారిందని, ఎన్నో సంవత్సరాల నుంచి టెక్నికల్, సీసీటీఎన్‌ఎస్, కోర్టు డ్యూటీలు, కంప్యూటర్ విధులు, అన్ని బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారన్నారు. సాధారణ డ్యూటీల మొదలు క్లిష్టతరమైన విధుల్లో చక్కగా పని చేస్తున్నారని, పోలీసులతో సమానంగా క్రైమ్, కంప్యూటర్ వర్క్, టెక్నికల్, కోర్టు, వృత్తి నైపుణ్యం ప్రదర్శిస్తున్నారన్నారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలని, పారదర్శకంగా, నిజాయితీగా పని చేయాలని, నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఏవో కృష్ణుడు, ఎస్బీ సీఐ సత్యనారాయణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, జాన్‌జోన, పెద్దయ్య, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



మదనపల్లెలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తవారిపల్లెలో సర్పంచ్ మహేష్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, పాసుపుస్తకాలు, సర్వే, అడంగల్ తదితర రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రజల ముంగిటకే అధికారులు వచ్చారన్నారు. ఇక్కడ ఇచ్చే ప్రతి అర్జీకి జవాబుదారితనంతో పరిష్కార మార్గం దొరుకుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కొత్తవారిపల్లె గ్రామానికి శ్మశాన వాటిక లేదని దీని వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సాయంత్రం వరకు మొత్తం 79 మంది వివిధ సమస్యలపై రెవెన్యూ సదస్సులో అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘువేంద్ర, డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: మండలంలో నెలకొన్న భూ సమస్యలను సత్వరపరిష్కారం కొరకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ప్రత్యేక అధికారి, డీపీవో బాలకృష్ణారెడిల్లు పేర్కొన్నారు. శుక్రవారం వెంగంవారిపల్లి గ్రామ పంచాయతిలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ గ్రామ సభలో 155 వరకు వివిధ అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ధనంజేయులు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరయణ, టీడీపీ అధికార ప్రనిధి ఆర్జే వెంకటేష్, నాయకులు సుధాకర్‌రావు, మల్లికార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



బి.కొత్తకోట బీరంగి రెవెన్యూ సదస్సులో ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్



గుర్రంకొండలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

భూ సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక

గుర్రంకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సులు మంచి పరిష్కార మార్గాలను చూపుతాయని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజల భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రైతుల భూములను తారుమారు చేసి చాలా మంది రైతులను వైసీపీ నాయకులు ఇబ్బందులకు గురిచేశారని అలాంటి సమస్యలను ఈ సదస్సుల్లో పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం ప్రజలు, రైతులను నుంచి అర్జీలను స్వీకరిం చారు. ఇందులో మొదటి రోజు వివిధ సమస్యలపై 41 అర్జీలు వచ్చినట్లు ప్రత్యేకాధికారి లక్ష్మీపతి తెలి పారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో వెంకటేశులు, వీఆర్వోలు, నాయకులు పాల్గొన్నారు.

రైతు సదస్సులోని ప్రతి అర్జీ పరిష్కారం



పెద్దమండ్యంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నోడల్ అధికారి సాంబశివ తదితరులు

పెద్దమండ్యం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో రైతుల నుంచి వచ్చిన అర్జీలు పరిష్కరిస్తామని పెద్దమండ్యం నోడల్ అధికారి, జిల్లా హౌసింగ్ పీడీ సాంబశివ పేర్కొన్నారు. మండలంలోని వెలిగల్లులో శుక్రవారం జరిగిన రైతు సదస్సులో రెవెన్యూకు సంబంధించి 85 అర్జీలు రాగా, ఇతర శాఖలవి 11 అర్జీలు వచ్చాయి. ఆన్‌లైన్, భూసర్వే, దారి సమస్యలు, రేషన్‌కార్డులు తదితర వాటిపై అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్‌అహ్మద్, ఎంపీ ఎంపీటీసీ సభ్యురాలు నరసమ్మ కూటమి నేతలు మాజీ సర్పంచ్ క్రిష్ణారెడ్డి, జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాధరెడ్డి, రామాంజులునాయుడు, రామాంజులు, రసూల్, కాలేషా, సాంబశివ గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను ఏర్పాటు చేసినట్లు నోడల్ అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం సుబ్రమణ్యం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మళ్లబండకోటలో తహసీల్దార్ శ్రీరాములునాయక్ ఆధ్వర్యంలో గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ గ్రామసభలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి రైతులకు రసీదును ఇచ్చారు. గ్రామంలో రెవెన్యూ సమస్యలపై 9 అర్జీలు, పెన్షన్లకు సంబంధించి 3 అర్జీలు, మంచి నీటి సమస్య కోసం ఒకటి, దారిసమస్యను కోరుతూ ఒక అర్జీ అందినట్లు తహసీల్దార్ తెలిపారు. స్థానిక సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విద్యాసాగర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

బి.కొత్తకోట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. శుక్రవారం బి.కొత్తకోట మండలంలోని బీరంగి గ్రామంలో జరిగిన రెవెన్యూసదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. గ్రామ సమీపంలో ఉన్న 7.50 ఎకరాల ఏటిపోరంబోకు స్థలంలో సింగిల్‌విండో గిడ్డంగుల కోసం కైటాయించాలని భావిస్తున్న 2 ఎకరాలను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ సదస్సులో వివిధ భూసమస్యలపై 51 మంది రైతులు అర్జీలు ఇచ్చుకున్నారు. కార్యక్ర మంలో తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ, రెవిన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పీటీఎంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం

ములకలచెరువులో: ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మదనపల్లె ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, మండల నోడల్ ఆఫీసర్ రషీద్‌ఖాన్, తహసీల్దార్ ప్రదీప్ పేర్కొన్నారు. మండలంలోని సెంట్రల్ స్కూల్‌లో శుక్రవారం రెవెన్యూ సదస్సులో మొత్తం 36 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో 32 రెవెన్యూ సమస్యలు, నాలుగు ఇతర సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు. ఈ సదస్సులో ఎండీపీవో హరినారాణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొలి సదస్సులో 103 దరఖాస్తులు

పీలేరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భాగంగా శుక్రవారం పీలేరు మండలం మేళ్లచెరువు గ్రామంలో జరిగిన గ్రామసభలో ప్రజల నుంచి 103 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ శాఖ ఈఈ భరత్ కుమార్, తహసీల్దారు భీమేశ్వర రావు, డీటీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ములకలచెరువులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఎక్స్‌కవేటర్ ఢీకొట్టి గుర్తు తెలియని వృద్ధుడు మృతి



వృద్ధుడి మృతదేహాన్ని రోడ్డు పక్కకు చేర్చిన స్థానికులు

కలికిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒక కంట్రాక్టరుకు చెందిన ఎక్స్‌కవేటర్ ఢీకొట్టడంతో గుర్తు తెలియని వృద్ధుడు (75) అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం సమీపంలో తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిపై జరిగిన సంఘటనతో దాదాపు గంట వరకూ రోడ్డు మీద ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆ తరువాత అక్కడున్న వారు వృద్ధుడి భౌతిక కాయాన్ని రోడ్డు పక్కకు చేర్చడంతో ట్రాఫిక్ సర్దుబాటయ్యింది. మొదట ప్రమాదానికి గురయిన వృద్ధుడు ఎక్స్‌కవేటర్ డ్రైవరు రెడ్డి గణేష్‌గా చెపుతున్నారు. అయితే ఈ సంఘటనకు సంబంధించిన సమాచారమేదీ అందలేదని స్థానిక పోలీసులు చెపుతున్నారు. శుక్రవారం రాత్రి వరకూ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని హెడ్ కానిస్టేబుల్ కొండప్ప చెప్పారు. పట్టపగలు ఇంత దారుణం జరిగినా వృద్ధుడికి సంబంధించిన వివరాలు తెలకపోవడం చర్చనీయాంశంగా ఉంది.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

కురబలకోట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ పరిధిలోని సర్కారుతోపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డ సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సర్కారుతోపు వద్ద ముందువెళుతున్న ట్రాక్టర్‌ను కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు స్వల్పంగా గాయపడ్డారన్నారు. వారిని స్థానికులు 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా అటుగా వెళుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సంఘటనను చూసి వెంటనే కారుదిగి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ప్రమాదం జరగడంతో ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ సభ్యత్వంతో గుర్తింపు, భరోసా



సభ్యత్వం నమోదు చేయిస్తున్న టీడీపీ నాయకులు

తంబళ్లపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు గుర్తింపు, భరోసా ఉంటాయని మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కురవపల్లెలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తంబళ్లపల్లె మండలంలో సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తున్నట్లు తెలిపారు. యువకులు, వృద్ధులు, మహిళలు స్వచ్ఛందంగా వచ్చి టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల మండల అధ్యక్షుడు రామాంజులు, రవి తదితరులు పాల్గొన్నారు.

10న చేపలచెరువు వేలం పాటలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని కోమటివానిచెరువులో చేపల పెంపకానికి ఈనెల 10వ తేదీన వేలం పాటలు నిర్వహించనున్నట్లు మత్స్యశాఖ అధికారి రుబీనా తెలిపారు. ఎస్‌బీఐ కాలనీ వార్డు సచివాలయం వద్ద ఉదయం 10గంటలకు నిర్వహించనున్న వేలం పాటల్లో ఆసక్తి వున్న వారు పాల్గొనాలని కోరారు. వేలంలో పాల్గొనే వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటల్లో పాల్గొనవచ్చన్నారు.

నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్,టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి ఆదేశాను సారం పాఠశాలల్లో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు, ప్రజాప్రతినిధులు, పాఠశాలల కమిటీ చైర్మన్లు, ఇతర పెద్దలతో సం యుక్తంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అసత్య ఆరోపణలపై చర్యలు తీసుకోవాలి

నిమ్మనపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాచవేటివారిపల్లికి చెందిన టీడీపీ సర్పంచ్ మధు, ప్రసాద్‌లు శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులు కొన్ని యూట్యూబ్ ఛానళ్లు ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అనవసరంగా అసత్య ప్రసారాలు, చేస్తున్నాయని వాటిపై కేసులు నమోదు చేయాని తెలిపారు.

చెన్నరాయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం



ఆలయ పునర్నిర్మాణం కోసం పూజలు చేస్తున్న మహిళలు

రామసముద్రం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిజల గ్రామంలో ఉన్న పురాతన చెన్నరాయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. గ్రామస్థులు, దేవదాయ శాఖ ఈవో రమణ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కులశేఖర్‌భట్టార్ వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా అగ్నిహోమం నిర్వహించి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టారు. కాగా గత 40ఏళ్లుగా ఈ ఆలయం పూజకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. గత కొంతకాలంగా ఆలయ పునరుద్ధరణపై ఒకరిద్దరు గ్రామస్థులు మధ్య తగాదా ఏర్పడగా ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం కాగా ఆలయ నిర్మాణానికి అడ్డంకులు తొలగాయి. ఈ ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరగా పూర్తి కావాలని కోరుతూ గ్రామస్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో దేవదాయ మునివెంకటస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మనపల్లె రోడ్డు ఆర్‌ఎస్ నగర్‌లోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ ధర్మకర్తలు రాచపల్లె సుబ్రహ్మణ్యం,రాచపల్లె అనురాధ ఆధ్వర్యంలో కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. కర్ణాటకకు చెందిన పురోహితులతో విశేషంగా పూజ కార్యక్రమం అర్చనలు, అభిషేకాలు, హోమాలు, కుంభాభిషేకం అత్యంతవైభవంగా చేశారు. ఆలయంలో ఉదయాన్నే కలశారాధన, శిఖర కళశాలకు అభిషేకం, గణపతి, మృత్యుంజయ, శాంతి, కళాన్యాస హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేషపూజలు



ప్రత్యేక అలంకరణలో కోర్టులో గంగమ్మ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు ఆలయకమిటీ సభ్యులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని సుప్రభాతసేవలో మేల్కొల్పి ప్రత్యేకంగా అలంకరణలు, అర్చనలు చేసి పూజలు నిర్వహించారు. శుక్రవారం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని చీర, జాకెట్లు పొంగళ్లు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఆలయకమిటీ సభ్యులు మార్పురి చిన్నరెడ్డెప్ప, పెరవలి వేణుగోపాల్ నాయుడు, మార్పురి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు, దేవేంద్ర మార్పురి విక్కీ, మార్పురి మహేష్, శ్రీనివాసులు నయుడు పర్యవేక్షించారు.

ఘనంగా అక్కదేవతల విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో అక్కదేవతలు

గుర్రంకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని సంగసముద్రం గ్రామంలో అక్కదేవతల విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి వేదపండితులు ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని కొబ్బరి కాయలు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నీరు తరలించే పనులు ప్రారంభం



నందలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటూరు చెరువుకు చెయ్యేరు నుంచి నీరు తరలించే పనులను శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భా గంగా ఎక్స్క వేటర్‌తో ఎగువ కాలువలో పూడిక తీస్తున్నారు. కన్యక చెరువుకు కూడా నీరందించే పనులు చేయాలని నాగిరెడ్డి పల్లె, నందలూరు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయం మంజూరు

మదనపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేస్తూ కేంద్ర క్యాబినేట్ ఆమోదం తెలిపింది. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఎట్టకేలకు అమోదం లభించింది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినేట్ సమావేశంలో రాష్ట్రానికి నూతన కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేసింది. ఇందులో మదనపల్లెకు కూడా చోటు లభించింది. దీంతో రానున్న విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభంకానున్నట్లు తెలిసింది. కాగా ఇప్పటికే ఉన్నతాధికారులు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు నాలుగు ఎకరాల స్థలం కేటాయించారు. ఇక్కడ తాత్కాలిక వసతి భవనాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లన్నీ అనేక పర్యాయరాలు కేంద్ర బృందాలు పరిశీలించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగింది.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బాస్ నాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మదనపల్లె పట్టణంలో పలుచోట్ల అంబేడ్కర్ వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని దిగువకమ్మపల్లె, అంబేడ్కర్‌నగర్‌లో బహుజన సేన రాష్ట్రఅధ్యక్షుడు చందు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదేళ్లవిద్యాసాగర్‌లు శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే బాస్ ఆధ్వర్యంలో, అలాగే బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శన్‌తో పాటు మాలమహానాడు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పీలేరులో: రాజ్యాంగ నిర్మాత, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, దళిత జన బాంధవుడు అయిన డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ 68వ వర్ధంతిని శుక్రవారం పీలేరులో ఘనం గా నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రజా, దళిత, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు స్థానిక పంచాయతీ కార్యాల యం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పెద్దఎత్తున పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీన, దళిత వర్గాలకు జీవితాల్లో నూతన వెలుగులు ప్రసాదించారని కొనియాడారు. శుక్రవారం సాయంత్రం ఎన్ఎస్ యూఐ శ్రేణులు ఆయన విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు.



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎన్ఎస్‌యూఐ శ్రేణులు

సప్లై ఛానెల్‌లో పూడికతీత పనులు ప్రారంభం

పీలేరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలోని అయ్యప్పనాయుని చెరువుకు పింఛా నది నుంచి నీటిని మళ్లించాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక నాయకులు సప్లై ఛానెల్‌లో పూడిక తీత పనులను ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పింఛా నది పరవళ్లు తొక్కుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, పింఛా నది నుంచి అయ్యప్పనాయుని చెరువుకు నీటిని మళ్లించాలని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి, తెలుగు యువత నాయకుడు రియాజ్‌ను ఆదేశించారు. దీంతో వారు శుక్రవారం చెరువు సప్లై ఛానెల్‌లో పూడిక తీత పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫైరోజ్, మొగిలీశ్వర, షఫీ, సద్దాం, షౌకత్ అలీ, చాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో యోగా కేంద్రం ప్రారంభం

పీలేరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పీలేరు కోటపల్లె మార్గంలో 'షీ' స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన యోగా కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా వల్ల నిత్యజీవితంలో తీవ్రమైన ఒత్తిడి, ఇబ్బందులు ఎదుర్కొంటున్న మానవాళికి ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. యోగా బోధనను ఉద్యమంలా సాగిస్తున్న పీవీఎస్ లక్ష్మీ, ఆమె భర్త రాయల సుధాకర్‌లను ఆయన ప్రశంసించారు. అనంతరం యోగా నిర్వాహకులు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, సాయి లోకేశ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యోగా కేంద్ర నిర్వాహకులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జవహర్ విద్యాలయాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జవహర్‌నవోదయ విద్యాలయాభివృద్ధికి విద్యార్థుల యాజమాన్య కమిటీ కృషి చేయాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వసలపల్లె వద్ద ఉన్న జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో వీఎంసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కమిటీ సభ్యులు కావడంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్ నవోదయ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేలాయుధన్ విద్యాలయాభివృద్ధి గురించిపవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో సభ్యులైన ఆరోగ్యశాఖ, విద్యాశాఖ అధికారులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులకు ఆధునిక వంగడాలు, మొక్కలు పంపిణీ



కేవీకేలో రైతులకు విత్తనాలు, అంటు మొక్కలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కలికిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రైతులకు ఆధునిక రకం విత్తనాలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. బెంగుళూరుకు చెందిన ఐసీఏఆర్, ఐఐహెచ్‌ఆర్ (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్) ఆధ్వర్యంలో రైతులకు కూరగాయలు, పండ్లతోటలకు సంబంధించిన విత్తనాలు, అంటు మొక్కలు పంపిణీ చేశారు. ఐసీఏఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ టీహెచ్ సింగ్, ఐఐహెచ్‌ఆర్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ అతకుల్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు పండించే కూరగాయలు, పండ్లను ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలకు సరఫరా చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈ సమావేశంలో రాయచోటి వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీ అశోక్‌కుమార్ రెడ్డి, కేవీకే కోఆర్డినేటర్ మంజుల, కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలోని ఆక్రమణలు తొలగింపు



ఆక్రమిత స్థలంలో బంకును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

వాల్మీకిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సమీపంలోని పంచాయతీ స్థలాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన బంకును స్థానిక ఈవో రవీంద్రనాథ్ శుక్రవారం సిబ్బందితో తొలగింపజేశారు. వాల్మీకిపురం పట్టణంలోని గ్రామ పంచాయతీ స్థలంలో ఆక్రమణ విషయమై గత నెల 15వ తేదీన(నవంబరు) 'రాత్రికి రాత్రే ప్రభుత్వ స్థలం ఆక్రమణ' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ అధికారులు ఎట్టకేలకు స్పందించి ఆక్రమిత స్థలంలోని బంకును తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా పంచాయతీ స్థలాలలో ఆక్రమణలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకో వడం జరుగుతుందని హెచ్చరించారు.

పీటీఎంలోని అంగన్‌వాడీ కేంద్రం-3 తనిఖీ



పీటీఎంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పీటీఎంలోని అంగన్‌వాడీ -3 కేంద్రాన్ని శుక్ర వారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. పిల్లల నమోదు, పిల్లల హాజరు, పిల్లలకు, బాలింతలకు, గర్భిణు లకు అందిస్తున్న పౌష్టికాహారానికి సంబం ధించిన పలు రికార్డులను ఆయన పరిశీ లించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించా లన్నారు. అంగన్‌వాడీల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అంగన్‌వాడీల్లో రికార్డులను పక్కాగా ఉంచుకోవాలని, కేంద్రాలలో సమయపాలన పాటించాలన్నారు. కేంద్రాల్లో పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

వాల్మీకిపురం సచివాలయం- 3లో ఆధార్ సేవలు

వాల్మీకిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని సచివాలయం 3నందు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో పేర్కొన్నారు. ప్రజలు తమ ఆధార్‌ల నందు ఏవైనా సమస్యలు ఉంటే సచివాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

దాడులకు యత్నించిన వారిని అరెస్టు చేయాలి

- అయ్యప్పస్వాముల ఆందోళన
- రెండు గంటల పాటు ఉద్రిక్తత
- ఇరువైపులా మోహరించిన ఇరువర్గాలు
- ఆందోళనకారులతో మాట్లాడిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- ఎట్టకేలకు సర్దుబాటు.. ఊపిరి పీల్చుకున్న జనం


ఆందోళన చేస్తున్న అయ్యప్పస్వాములను అడ్డుకుంటున్న పోలీసులు

రాయచోటి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వాముల గ్రామోత్సవం సందర్భంగా గురువారం రాత్రి పట్టణంలో జరిగిన వివాదం నేపథ్యంలో.. శుక్రవారం ఉదయం పట్టణంలో అయ్యప్పస్వాములు ఆందోళనకు దిగారు. శాంతియుతంగా గ్రామోత్సవం చేస్తున్న తమను అడ్డుకుని.. దాడి చేయడానికి యత్నించిన వారిపై కేసులు నమోదు చేసి.. అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ.. పెద్దఎత్తున అయ్యప్పస్వాములు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్ఎన్ కాలనీలోని శివనంది సర్కిల్ నుంచి నేతాజి సర్కిల్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అయితే గురువారం రాత్రి ఠాణా సర్కిల్‌లో ఓ వర్గం ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడి ఆందోళనకు దిగడంతో.. ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో..పోలీసులు ఈ ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వందల సంఖ్యలో అయ్యప్పస్వాములు ఉండడంతో పోలీసులు వారిని నిలువరించలేకపోయారు. పరిస్థితి అదుపు తప్పుతుందనే అనుమానంతో వందలాది మంది పోలీసులను ఉన్నతాధికారులు రప్పించారు. రాజధాని హోటల్ ఎదురుగా రోడ్డుపైన ఆందోళన చేస్తున్న అయ్యప్పస్వాములను పోలీసులు అడ్డుకున్నా వారిని తోసుకుని నేతాజీసర్కిల్‌కు చేరుకుని అక్కడ రోడ్డుపైన బైఠాయించి ఆందోళన చేశారు. రాత్రి తమను అడ్డుకున్న ప్రాంతంలోకి ఇప్పుడు వెళ్తామని అయ్యప్పస్వాములు పట్టుబట్టారు. రాయచోటి అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ చంద్రశేఖర్ తదితరులు ఆందోళనకారులకు నచ్చజెప్పేందుకు యత్నించినా వారు ఆందోళనను కొనసాగించారు. ఇదే సమయంలో అటువైపు మరో వర్గానికి చెందిన వాళ్లు కూడా పెద్ద సంఖ్యలో గుమికూడి నినాదాలు చేశారు. దీంతో ఒకసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరువర్గాలు పోలీసుల మాట వినకపోవడంతో.. గొడవ పెద్దదవుతుందేమోనని అందరూ ఆందోళన చెందారు. ఈ సమయంలో ఆందోళనకారుల వద్దకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వచ్చి సర్దిచెప్పారు. రాయచోటి పట్టణంలో హిందూ, ముస్లింలు సోదరభావంతో జీవించాలని ఆయన కోరారు.

రాయచోటి ప్రజల ప్రశాంత జీవనాన్ని దృష్టిలో పెట్టుకుని ఆందోళన విరమించాలని సూచించడంతో ఎట్టకేలకు ఆందోళనకారులు ఆందోళన విరమించారు. మరోవైపు గుమికూడిన ఇంకో వర్గం ప్రజలను అదే వర్గానికి చెందిన పలువురు పెద్దమనుషులు, యువకులు శాంతింప చేసి అక్కడి నుంచి పంపించేశారు. దీంతో సుమారు రెండు గంటల పాటు సాగిన ఆందోళన సద్దుమణిగింది. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి ఠాణా సర్కిల్‌లో పర్యటించి.. పోలీసు ఉన్నతాధికారులకు పలు సూచనలు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని రాయచోటికి తరలించారు. సున్నితమైన ప్రాంతాలలో పోలీసులను మోహరించారు. రాయచోటి పట్టణాన్ని పోలీసులు తమ గుప్పిట్లోకి తీసుకున్నారు.

జీవో 145కు రద్దు చేయండి

- కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన


విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం జరగాల్సిన క్రిమినల్ కేసులు ఇక్కడ జరిగే అవకాశం లేకుండా తీసుకొచ్చిన జీవో 145ను వెంటనే రద్దు చే యాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. శుక్రవారం న్యాయవా దులు విధులు బహిష్కరించి రాయచోటి కోర్టు ఎదుట నిరసన తెలియచేశారు. ఈసందర్భంగా రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్య, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు మా ట్లాడుతూ జీవో 145 వలన రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కూడా భవిష్యత్తులో ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నమోదయ్యే కేసులు ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే అవకాశం లేకుండా పోతుందన్నారు. రాయలసీమ జిల్లాల మొత్తానికి తిరుపతి కేంద్రంగా ఒకే ఒక కోర్టు ఉం టుందని, కోస్తా ప్రాంతంలో నాలుగు కోర్టులు మాత్రమే పని చేస్తాయని, దీనివలన కక్షిదారులు సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సి వస్తుందని వారికి ఆర్థికంగా భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ముంగిట్లోకి న్యాయం చేరేలా న్యాయవ్యవస్థ అభివృద్ధి కావాలని దేశ అత్యున్నత న్యాయస్థానం చెబుతు న్నప్పటికీ ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా జీవో 145 తెచ్చి ప్రజలకు న్యాయవ్యవస్థను దూరం చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి నాగముని, భార త న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షుడు టి.ఈశ్వర్, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, రాజమనోహర్, ధనుంజయ కుమార్, రామాంజులు, రవిశంకర్, తాహీర్, నాగమల్లు, వీరభద్రయ్య, కుసుమ, వరలక్ష్మి పాల్గొన్నారు.

520 బియ్యం బస్తాల లారీ పట్టివేత



మైదుకూరు రూరల్, డిసెంబ రు 6 (ఆంధ్రజ్యోతి): అక్ర మంగా రవాణా చేస్తున్న బియ్యం లారీని మైదుకూ రులోని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసు కున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శివ శంకర్ సమాచారం మేరకు.. జమ్మలమడుగు నుంచి చెన్న య్‌కి వెళుతున్న బియ్యం లారీని మైదుకూరులో పోలీ సులు అదుపులోకి తీసుకొని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అటాచ్ చేశారు. లారీలో 520 బస్తాల బియ్యం ఉండగా.. వీటి విలువ సుమారు రూ.10లక్షల 79 వేలు ఉంటుందని తెలిపారు. సీజ్ చేసిన బియ్యం బస్తాలను గోడౌన్‌కు తరలించినట్లు శివశంకర్ తెలిపారు.

ఉపాధ్యాయుడు ఎజాజ్ మృతి బాధాకరం : మంత్రి


మంత్రి నారాలోకేశ్‌తో ఫోనులో మాట్లాడుతున్న ఎజాజ్ అహ్మద్ కుటుంబ సభ్యులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఎజాజ్ ఆకస్మిక మృతి బాధాకరమని, ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తుందని రాష్ట్రరవాణా క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కడప నగరంలోని మృతుడు నివాసంలో ఎజాజ్ కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి ..కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆకతాయి చేష్టలు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడి ప్రాణాలు కోల్పోవడానికి కారణం కావడం బాధాకరమన్నారు. ఈసంఘటనపై సీఎం సీరియస్‌గా ఉన్నారన్నారు. ఎజాజ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉందని, అతని మృతికి గల కారణాలపై సమగ్రంగా విచారణ చేపట్టి తెలుసుకుంటామన్నారు. ఒక మంచి ఉపాధ్యాయుని కోల్పోయిందని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని.. వారి కుటుంబ సభ్యులకు ఓదార్పును, తమ ప్రగాఢ సానుభూతి తెలుపుకుంటున్నామని అన్నారు. ఈసందర్భంగా విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ ఫోను చేసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

ఎస్టీయూ వినతి : ఎజాజ్ అహ్మద్ కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా రాష్ట్ర నాయకులు బాలగంగారెడ్డి కోరారు. శుక్రవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఎస్టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఎస్టీయూ నాయకులు సాదిక్‌అలీ, సంజీవరాయుడు, జబీబుల్లాఖాన్, ఫక్రుద్దీన్, ఖాజామొయినుద్దీన్, ఫయాజ్ పాల్గొన్నారు.

వైవీయూలో విభాగాల అధిపతుల నియామకం

కడప ఎర్రముక్కపల్లె డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో పలు విభాగాల అధిపతులను నియమిస్తూ రిజిస్ట్రారు ప్రొఫెసరు పుత్తా పద్మ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 డిసెంబరు 4 వరకు విధుల్లో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో పనిచేసిన వారి పదవీ కాలం పూర్తి కావడంతో నూతన నియామకాలు చేపట్టామన్నారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్ (ఎర్త్‌సైన్స్), డాక్టర్ రామక్రిష్ణ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్‌ఫర్‌మేటిక్, డాక్టర్ చంద్రశేఖర్ పర్యావరణ శాస్త్రం, డాక్టర్ మునికుమారి జెనెటిక్ అండ్ జనోమిక్, డాక్టర్ ఎస్.సుభాష్ చంద్ర మైక్రోబయాలజీ, డాక్టర్ లాజర్ మనస్తత్వ శాస్త్రం, డాక్టర్ ప్రమీలా మార్గరేట్ పొలిటికల్ సైన్స్‌అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ప్రొఫెసరు ఎంఎం వినోదిని తెలుగు, ప్రొఫెసరు శ్రీనివాసులు ఆర్థికశాస్త్రం, డాక్టర్ ఎస్వీ వెంకటరమణ జంతు శాస్త్రం, డాక్టర్ సునీత భూగర్భశాస్త్రం, డాక్టర్ సి.సరిత బిజినెస్ మేనేజ్‌మెంటు, కె.మృత్యుంజయరావు ఫైన్‌ఆర్ట్స్, డాక్టర్ టి.శ్యాంస్వరూప్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్, డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్‌గా నియమితులయ్యారు.

చికిత్స పొందుతూ 108 వాహన పైలెట్ మృతి

రామాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 108 వాహనం పైలెట్ సంగటి రమేశ్‌బాబు (35) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వైఎస్ఆర్ జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లయపల్లె రవీంద్రనగర్ వాసి రమేశ్‌బాబు మొలకలచెరువులో 108 వాహనం పైలెట్‌గా పనిచేస్తున్నాడు. కడపలో 108 వాహనం మరమ్మత్తులు చేయించుకుని తిరిగి మొలకలచెరువుకు వస్తుండగా గురువారం రాత్రి గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు రోల్ మోడల్‌గా ఉండాలి


శిక్షణ కార్యక్రమానికి హాజరైన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు

రాయచోటిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించి రోల్ మోడల్‌గా నిలవాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. శుక్రవారం గాలివీడు రోడ్డులోని అర్చనా కళాశాలలో స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్ అండ్ గైడ్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులు, గురువులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ సమాజంపై బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సమకూరుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సమకూర్చేందుకు, భవన నిర్మాణానికి కృషి చేయాలని స్కౌట్ అధికారులు మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో అర్చనా విద్యాసంస్థల కరస్పాండెంట్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మౌలాలి, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, స్కౌట్ అధికారులు, వివిధ మండలాల నుంచి శిక్షణకు వచ్చిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన సమగ్ర పథకానికి రూ.18.13 కోట్లు మంజూరు

కడప ఎన్జీఆర్ సర్కిల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ఉద్యాన సమగ్ర పథకం కింద రూ.18.13 కోట్లు మంజూరైనట్లు జిల్లా ఉద్యాన అధికారి ఎస్.సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్, శీతల గిడ్డంగులు, శీతల గదులు, రెఫనింగ్ చాంబరు, ఉల్లి నిల్వ గోదాములు, కలెక్షన్ సెంటరులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారానికి మండలాల్లోని ఉద్యానశాఖ అధికారులను, కలెక్టరేట్‌లోని ఓ బ్లాక్‌లో ఉన్న తమ కార్యాలయంలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

ఇరువురి మధ్య ఘర్షణ- ఒకరిమృతి


రామాంజనేయులు మృతదేహం

చక్రాయపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికొవ్వూరు గ్రామం దళితవాడలో శుక్రవారం సాయంత్రం మురుగునీరు వస్తున్నాయని ఘర్షణకు దిగడంతో దండు రామాంజనేయులు (36) మృతిచెందాడు. దండు రామాంజనేయులు భార్య శివలక్ష్మి ఫిర్యాదు మేరకు చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళితే... బట్టలు ఉతికే నీళ్ల ఇంటి ముందు పోతున్నాయని నాగార్జున, రామాంజనేయులు గొడవకు దిగారు. దీంతో రామాంజనేయులు నాగార్జున చెల్లెలను కొట్టడంతో నాగార్జున కోపంతో రామాంజనేయులును కట్టెతో కొట్టడంతో మృతిచెందినట్లు తెలిపారు. నాగార్జున పరారీలో ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

విద్యుత్ సమస్యలపై ఏకరువు

- ప్రత్యేక విద్యుత్తు అదాలత్ చైర్‌పర్సన్ ఎదుట వినియోగదారుల ఆవేదన

జమ్మలమడుగు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు విద్యుత్తు సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రత్యేక విద్యుత్తు అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రత్యేక విద్యుత్తు అదాలత్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి మాట్లాడుతూ జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సమస్యలున్నవారు నేరుగా చెప్పడం లేదా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని వినియోగదారులకు సూచించారు. ఈ మేరకు జమ్మలమడుగు పట్టణంలోని ఓ ఇంటి యజమాని గత 13 సంవత్సరాలుగా తన ఇంటికి సంబంధించి పెండింగ్ కరెంటు బిల్లు రూ.1.35 లక్షలు ఉందని... తగ్గిస్తే బిల్లు కడుతానని తెలిపారు. ఇందుకు చైర్‌పర్సన్‌తో పాటు కమిటీ సభ్యులు బిల్లులను తగ్గించేది లేదని, వాయిదాల పద్ధతిలో కట్టవచ్చని చెప్పారు. అలాగే జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల పరిధిలోని పలువురు తమ తమ సమస్యలను నేరుగా చెప్పారు. మరికొందరు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జమ్మలమడుగు పట్టణంలోని మున్సిపాలిటీకి సంబంధించి వాటర్‌ప్లాంట్లకు సుమారు కోటి రూపాయల వరకు బకాయిలు ఉంటాయని.. ఇంతవరకు వారిని ఎవరు అడగడం లేదన్నారు. కేవలం చిన్న చిన్న ఇబ్బందులతో బిల్లులు కట్టలేని పేద ప్రజలకు మాత్రమే బిల్లులు కట్టాలని ఒత్తిడి చేయడం దారుణమన్నారు. ఆర్థిక సభ్యుడు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, డీఈ రాజగోపాల్, ఏఈలు, కిందిస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌గండి వద్ద యువకుడు మృతి


యోహాను (ఫైల్)

చెన్నూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గండి వాటర్ వర్క్స్ వద్ద శుక్రవారం సాయంత్రం ఈత కోసం దిగిన కడప నగరానికి చెందిన దాట్ల యోహాను (20) అనే యువకుడు మృతి చెందాడు. కడప అశోక్‌నగర్‌కు చెందిన దినసరి కూలీ దాట్ల ప్రతాప్ కుమారుడు యోహాను ఐటీఐ పూర్తి చేశాడు. శుక్రవారం స్నేహితులతో కలిసి సరదాగా గండి వాటర్‌వర్క్స్ వద్దకు వెళ్లాడు. అక్కడ నీటిలో ఈత కొడుతుండగా నీటి ఉధృతికి మునిగి చనిపోయాడు. దీంతో అతని స్నేహితులు ఇతరుల సాయం కోసం కేకలు వేసినా ఫలితం లేకుండా పోయింది. సీఐ పురుషోత్తంరాజు మాట్లాడుతూ హెచ్చరిక బోర్డులున్నా నిర్లక్ష్యంతో దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తగు జాగ్రత్తలు చెప్పాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లింగాలలో హైనా కలకలం


ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

లింగాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లింగాలలో శుక్రవారం ఉదయం హైనా కలకలం రేగింది. గ్రామానికి చెందిన బయన్న ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఉదయం ఇంటి నుంచి బయటకు రాగానే ఎదురుగా ఉన్న హైనా పరుగులు తీసింది. పులిపిల్లగా భావించి అందరికి పులిపిల్లను చూశానని తెలిపాడు. సమాచారం అందుకున్న ముద్దనూరు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు సంఘటన స్థలంలోని పాదముద్రలు పరిశీలించి హైనాగా గుర్తించారు. ఆయన మాట్లాడుతూ హైనా కుక్క జాతికి చెందినమాంసాహార జంతువు అని తెలిపారు. దీంతో మనుషులకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. చిన్న పిల్లల పట్ల కాస్త అప్రమత్తగా ఉండాలని సూచించారు. కర్ణపాపాయపల్లెలో కూడా గురువారం పొలంలో కనిపించిన జంతువు హైనాగా గుర్తించారు.

పోలీసుల అదుపులో పాల వ్యాపారి....?

కడప(క్రైం)డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాత కడపకు చెందిన పాల వ్యాపారిని రిమ్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. రామంజనేయపురానికి చెందిన మహిళకు, అలాగే కాగితాలపెంట ప్రాంతానికి చెందిన మరో మహిళకు పాలు పోస్తుంటాడు. ఒక మహిళకు తెలియకుండా మరో మహిళకు వారి ఫొటోలు వాట్సాప్ ద్వారా పంపించాడు. రామాంజనేయపురానికి చెందిన మహిళ ఫొటోలు తీస్తుండగా.. ఆమె తన ఫొటోలు ఎందుకు తీస్తున్నావంటూ పాలవ్యాపారిని నిలదీసినట్లు సమాచారం. ఆమె సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాల వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

అప్పు చెల్లించలేదని.. వ్యక్తిని కిడ్నాప్ చేసిన వ్యాపారి

కడప(క్రైం), డిసెంబరు 6: కడప నగరం ఎన్జీవో కాలనీకి చెందిన ఓ వ్యక్తి వేంపల్లెకు చెందిన వ్యాపారి వద్ద లక్షల్లో అప్పు తీసుకున్నట్లు తెలిసింది. ఈ అప్పు చెల్లించ కపోవడంతో శుక్రవారం ఆ వ్యాపారి కడపలోని అప్పు తీసుకున్న వ్యక్తి ఇంటికి రాత్రి వచ్చి కారులో బలవంతంగా తీసుకెళ్లినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఈ విషయంపై చిన్నచౌకు పోలీసులను వివరణ అడుగగా... ఈ విషయం తమ దృష్టికి రాలేదని, ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

కమలాపురం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలోని కుప్పూరువారిపల్లె వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో పట్టపగలే చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గురువారం ఉదయం ఓ వైపు అయ్యప్ప శివమాలధారులకు వంట మనిషి, మరికొందరు భిక్ష వండే పనిలో నిమగ్నం కాగా అందులో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి వెళ్లిపోయారు. అర్చకుడు కూడా మరో దేవాలయంలో పూజలు చేసేందుకు వెళ్లారు. ఎవరి పనిలో వారు ఉండగా ఇది గమనించిన గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి అక్కడ స్వామివారి వద్ద ఉన్న రెండు కిలోల బరువున్న వెండి పళ్లెం, రెండు పావుకోళ్లను అపహరించుకుని వెళ్లారు. వాటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని ఆలయ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. ఒక దొంగ ఆలయంలోకి వెళ్లి వెండి వస్తువులను తీసుకుని గోడ అటు వైపు వేయడంతో మరో దొంగ వాటిని తీసుకెళ్లి తరువాత ఇద్దరూ ద్విచక్ర వాహనంపై వెళ్లినట్లు తెలిసిందన్నారు. ఆ మేరకు గురువారమే పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి పరిశీలించి వెళ్లారని ఆయన తెలిపారు.

అట్లూరులో పట్టపగలే ఇంటిలో చోరీ

- రూ.2లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు అపహరణ

అట్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఎగువపల్లి కాలనీకి చెందిన లక్షుమ్మ ఇంటిలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పట్టపగలే ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న సుమారు రూ.2లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఎస్ఐ రామక్రిష్ణ వివరాల మేరకు... బాధితురాలు లక్షుమ్మ, కుమారుడు కొండయ్య ఉదయం 11గంటల సమయంలో బద్వేలుకు వెళ్లి తిరిగి 2గంటల సమయానికి ఇంటికి చేరుకు న్నారు. ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడం గమనించి.. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారు అభరణాలను చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బద్వేలు సీఐ నాగభూషణ్, గోపవరం ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. చుట్టుపక్కల వారిని విచారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నాగభూషణం తెలిపారు.

పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు కీలకం


హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో హోంగార్డ్స్ సేవలు కీలకంగా మారాయని అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలిపారు. హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 322 మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తుండగా అందులో పురుషులు 303 మంది, మహిళలు 19 మంది ఉన్నారని, పోలీసుశాఖకు వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. పోలీసులతో సమానంగా హోంగార్డులు సేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు. హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో కీలకంగా మారిందని, ఎన్నో సంవత్సరాల నుంచి టెక్నికల్, సీసీటీఎన్ఎస్, కోర్టు డ్యూటీలు, కంప్యూటర్ విధులు, అన్ని బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారన్నారు. సాధారణ డ్యూటీల మొదలు క్లిష్టతరమైన విధుల్లో చక్కగా పని చేస్తున్నారని, పోలీసులతో సమానంగా క్రైమ్, కంప్యూటర్ వర్క్, టెక్నికల్, కోర్టు, వృత్తి నైపుణ్యం ప్రదర్శిస్తున్నారన్నారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలని, పారదర్శకంగా, నిజాయితీగా పని చేయాలని, నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు ప్రతిష్ఠను పెంచేలా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఏవో కృష్ణుడు, ఎస్బీ సీఐ సత్యనారాయణ, రిజర్వ్ ఇన్‌స్పెకర్లు వీజే రామకృష్ణ, జాన్‌జోస, పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



భక్తజనసాగరం

వేడుకగా పంచమీతీర్థం

శుక్రవారం వేకువజాము నుంచే పంచమి వేడుకలు తిరుచానూరులో మొదలయ్యాయి. పద్మావతీ అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాల అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు సన్నిధి ముఖమండపంలో చూర్ణాభిషేకం, ఆస్థానం నిర్వహించారు. అనంతరం అమ్మవారు, చక్రత్తాళ్వార్లను వేంచేపుగా పద్మసరోవరం పంచమీతీర్థ మండపంలో కొలువుదీర్చారు. సరిగ్గా10.35 గంటలకు తిరుమల నుంచి శ్రీవారు పంపిన సారె ఈ మండపానికి చేరుకుంది. అనంతరం ముత్తైదువ సారెతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అభిజిత్ లగ్నం శుభ గడియల్లో పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు.ఇదే సమయంలో అశేష భక్త జనం 'శ్రీ పద్మావతీ పాహిమాం, గోవిందా... గోవింద' అంటూ పుష్కరిణిలో మునకలేశారు. కాగా పొద్దుపోయే వరకూ సుమారు లక్ష మంది వరకు పుణ్యస్నానాలు ఆచరించినట్లు టీటీడీ అంచనా.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

పద్మావతికి 1.11 కోట్ల పుట్టినరోజు కానుకలు

పుట్టినరోజున పద్మావతమ్మకు శ్రీనివాసుడు ఈ ఏడాది వజ్రాభరణాలను కానుకగా పంపడం విశేషం. తిరుమల నుంచి పాండియన్ కిరీటం, వజ్రాల లక్ష్మీపతకం, హారం, గాజులు, జత కమ్మలు అందాయి. వీటి విలువ రూ.1.11 కోట్లు. ప్రతియేటా చక్రస్నానం రోజున శ్రీవారు ఆభరణాలను పంపించడం ఆనవాయితీ. వీటిని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అలంకరించారు.











సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - వాసంశెట్టి సుభాష్ - స్మిత

ప్రసాదాల నాణ్యత పెరిగింది

తిరుమల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, గాయని స్మిత దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. తిరుమలలో అందరూ సమానమే భావన కనిపిస్తోందని మంత్రి సుభాష్ అన్నారు. ప్రసాదాల నాణ్యత కూడా బాగా పెరిగిందన్నారు. రాష్ట్రంలోని ఇతర ఆలయాల్లోనూ ప్రసాదాల రుచి పెరిగినట్లు చెప్పారు. ఆర్థికంగా క్లిష్టపరిస్థితుల్లో ఉన్న ఏపీని గట్టెక్కించాలని, తెలుగు ప్రజలందరికీ ఆశీర్వాదాలు ఇవ్వాలని స్వామిని ప్రార్థించినట్లు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు.

రిటైర్డు అదనపు ఎస్పీ జీవీ రమణ మృతి



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేసి అదనపు ఎస్పీగా ఉద్యోగ విరమణ పొందిన జీవీ రమణ శుక్రవారం మృతి చెందాడు. ఆయన తిరుపతిలోని పోస్టల్ కాలనీలో కాపురముంటున్నారు. రిటైర్డు అదనపు ఎస్పీలు అభిషేకం, దేవదానం, సాంబశివారెడ్డి, నారాయణస్వామి, శ్రీనివాసులు, రిటైర్డు డీఎస్పీలు గంగరాజు, పోతప్ప, నంజుండప్ప, రవిశంకర్ రెడ్డితో పాటు జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకుడు శంకర్ రెడ్డి తదితరులు రమణ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. శనివారం ఆయన అంత్యక్రియలు తిరుపతిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వేలిముద్ర వేయగానే ఖాతాలో నగదు మాయం

● ఇద్దరు యువకులపై కేసు

గూడూరు,డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయిస్తామన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు అనుసంధానం చేయాలని నమ్మించారు. ఆధార్ డివైజ్‌తో వేలిముద్రలు తీసుకున్నారు. నగదూ వసూలు చేశారు. ఇక, వేలి ముద్ర వేయగానే కొందరి బ్యాంకు ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేసినట్లు మెసేజీలు వచ్చాయి. గూడూరు మండలంలోని రెడ్డిగుంటసంగంలో ఇలా జరగడంతో గ్రామస్థులు శుక్రవారం ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.రూరల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యంరాజు తెలిపి న ప్రకారం.. సైదాపురం గ్రామానికి చెందిన గోపి, వెంకటేశ్వర్లు రెడ్డిగుంట సంగం గ్రామానికి వెళ్లారు.ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసమని ఆధార్ డివైజ్‌లో ఓ మహిళ వద్ద వేలిముద్ర వేయించారు.అంతే, కాసేపటికి ఆమె ఖాతాలో రూ.1000 నగదు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో గ్రామస్థులకు అనుమానం వచ్చింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గోపి, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ చరిత్రలో తొలిసారిగా ఇన్‌చార్జుల పాలన

● జిల్లాలో ఆరు కీలక పోస్టులు ఖాళీ

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చరిత్రలో తొలిసారిగా జిల్లా ప్రజారవాణా సంస్థలో ఆరు కీలక పోస్టులు ఖాళీ పడగా, ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతోంది. గతంలో ఒకటి రెండు పోస్టులకు ఇన్‌చార్జి అధికారులను నియమించినా వారం వ్యవధిలో రెగ్యులర్ అధికారులను నియమించేవారు. ఏళ్ల తరబడి ఇన్‌చార్జీలతోనే సరిపెట్టేస్తుండటం గమనార్హం. రాష్ట్రంలోనే ఎక్కువ డిపోలు, అధిక ఉద్యోగులు, బస్సులు, మెజారిటీ ప్రయాణీకుల రవాణా, రాబడి కూడా ఎక్కువే, అధిక సంఖ్యలో వాణిజ్య దుకాణాలు, కార్గో ప్రధాన కేంద్రం ఇలా అన్ని విభాగాలలో జిల్లా మిన్నగానే ఉంటోంది. ఇన్‌చార్జ్‌ల పాలన విషయం విజయవాడ ప్రధాన కార్యాలయంలో తెలిసినా పట్టించుకోవడం లేదనే అసంతృప్తి అధికారుల్లో ఉంది. ప్రపంచ పుణ్యక్షేత్రం తిరుపతి కావడంతో ప్రజారవాణా సంస్థకు సంబంధించిన వ్యవహారాలు బిజీగానే ఉంటాయి. అలాగే తిరుమల ప్రోటోకాల్ పనులు కూడా తరచూ ఉంటాయి. ప్రత్యేక ఉత్సవాలు, పర్వదినాలు వంటి రోజుల్లో బస్సులు అదనంగా నడపాల్సి ఉంటుంది. ఇంత క్లిష్టంగా ఉండే తిరుపతి జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీ విభాగం ప్రధాన అధికారి నుంచి మరో ఐదు అధికారుల పోస్టులకు ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతుండటం కొసమెరుపు.

ఇంచార్జ్ పోస్టుల వివరాలు...

● డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫీసర్(డీపీటీవో)గా ఉన్న సీనియర్ అధికారి టి.చెంగల్‌రెడ్డికి పదోన్నతి లభించడంతో గత అక్టోబరులో విజయవాడ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో చిత్తూరుజిల్లా డీపీటీవో జగదీష్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు.

● పర్సనల్ ఆఫీసర్(పీవో)గా పార్థసారథి గత మేనెలాఖరులో పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి చిత్తూరు పీవో సహజాద్‌కు పీవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

●తిరుపతి కమర్షియల్ ఏటీఎం సురేంద్రబాబు గత మేనెల్లో పదవీ విరమణ చేయగా, సీబీఎస్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

● చెన్నై అసిస్టెంట్ ట్రాఫిక్ మేజేజర్లు(ఏటీఎం) రెండేళ్ల క్రితం బదిలీలపై వెళ్లగా తిరుపతి సీబీఎస్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు అప్పటి నుంచి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈయనకు సీబీఎస్ ఏటీఎం విధులే అత్యంత కీలకం, క్లిష్టం. అయినా చెన్నై ఏటీఎంగా దాదాపు రెండేళ్ల నుంచి, తిరుపతి కమర్షియల్ ఏటీఎంగా గత జూన్ నెల నుంచి కొనసాగుతున్నారు.

●శ్రీకాళహస్తి డిపో మేనేజర్‌గా రాజవర్ధన్‌రెడ్డి గత సెప్టెంబరులో పదవీ విరమణ చేశారు. ఆ స్థానాన్ని తిరుపతి డీఎం బాలాజీకి అదనపు బాధ్యతలు అప్పగించారు.

● తాజాగా గత శనివారం డిప్యూటీ సీటీఎం భాస్కర్ పదవీ విరమణ చేయగా ఆ ఖాళీని తిరుమల డిపో మేనేజర్ విశ్వనాథంకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. జిల్లాలోనే అత్యంత కీలకమైన తిరుమలడిపో వ్యవహారాలను చక్కబెట్టడడం గగనం. అయితే డిప్యూటీ సీటీఎంగా ప్రధాన బాధ్యతల నిర్వర్తించడం పనిభారమే అవుతుంది. తిరుపతిలో మధ్యాహ్నం వరకు ఆపైన కొండకు వెళ్లాల్సివుంది.

హోంగార్డులు నైపుణ్యం పెంచుకోవాలి

రిజర్వు ఏఎస్పీ శ్రీనివాసరావు



హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవంలో శ్రీనివాసరావు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికనుగుణంగా హోంగార్డులు వృత్తి నైపుణ్యతను పెంచుకోవాలని రిజర్వు జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. హోంగార్డుల 62వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం పోలీసు పరేడ్ గ్రౌండులో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందితో పోలిస్తే హోం గార్డులకు సౌకర్యాలు తక్కువగా ఉన్నా కొన్ని సందర్భాల్లో వారికంటే ఎక్కువ సేవ చేస్తున్నారన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు చిరంజీవి, పోతులురాజు, హోంగార్డులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలలో మహారాష్ట్ర భక్తుడి అదృశ్యం



అనిల్ మార్ఘాకర్ (ఫైల్ ఫొటో)

తిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన మహారాష్ట్ర భక్తుడు కనిపించకుండా పోయినట్లు తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన అనిల్ మార్ఘాకర్(45) మరో 30 మందితో కూడిన భక్తబృందంతో గతనెల 29వ తేదీన తిరుమలకు వచ్చాడు. తలనీలాలు సమర్పించి ఉచిత క్యూ ద్వారా ఆలయంలోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి వచ్చే క్రమంలో ఆలయ మహద్వారం వద్ద రద్దీలో బృందం నుంచి విడిపోయాడు. వెంటనే బృందంలోని సభ్యులు అతని కోసం తిరుమల మొత్తం గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో సొంతూరికి వెళ్లి చూశారు. అక్కడా లేకపోవడంతో ఆయన కుమారుడు రోహన్ శుక్రవారం తిరుమలకు చేరుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు తెలిసినవారు 94407 96769కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

త్వరలో భారీగా సీఐల బదిలీలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో భారీ ఎత్తున సీఐల బదిలీలు జరగనున్నాయి. తిరుపతి ఈస్ట్, తిరుమల టూటౌన్, తిరుపతి క్రైం స్టేషన్‌లో రెండు, భాకరాపేట సర్కిల్ కార్యాలయాల్లో రెగ్యులర్ సీఐలు లేరు. ఇక్కడ రెగ్యులర్ సీఐలను నియమిస్తూ భారీగా బదిలీలు జరగనున్నట్లు తెలిసింది. తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐని వీఆర్‌కు పంపిన అధికారులు.. ఇప్పటి వరకు ఇక్కడ రెగ్యులర్ సీఐని నియమించలేదు. ప్రస్తుతం తిరుపతి వెస్ట్ సీఐ రామకృష్ణ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇక భాకరాపేట సీఐగా జిల్లా కేంద్రంలో సోషల్ మీడియాలో సీఐగా పనిచేస్తున్న ఇమ్రాన్‌బాషాను ఇన్‌చార్జిగా నియమించారు. తిరుమల టూ టౌన్‌కు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఉన్న శ్రీరాముడిని ఇన్‌చార్జిగా నియమించారు. వీరందరినీ పరిపాలనా సౌలభ్యం దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ అటాచ్‌మెంట్లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక తిరుపతిలో కీలకమైన క్రైం స్టేషన్‌లోనూ ఇద్దరు సీఐలు లేరు. డీఎస్పీనే చూసుకోవాల్సి వస్తోంది. ఇక, ఐదు నెలల కాలంలో పనితీరు, గంజాయి అక్రమ రవాణా, డ్రగ్స్ సరఫరా, పాత కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయడంలో విఫలమైన ఒకరిద్దరు సీఐలపై వేటు పడనున్నట్లు సమాచారం. వారి స్థానంలో సమర్థులను నియమించాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. తూర్పు మండలాలకు చెందిన ఇద్దరు అధికారులకు స్థాన చలనం తప్పదనే ప్రచారం జరుగుతోంది.



హైకోర్టు ఉత్తర్వులను అధికారులకు అందజేస్తున్న సంఘమిత్రలు

ఆ సంఘమిత్రలను కొనసాగించండి

● తీర్పునిచ్చిన హైకోర్టు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విధుల నుంచి తొలగించిన ఐదుగురు సంఘమిత్రలను తిరిగి కొనసాగించాలంటూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ మేరకు సంఘమిత్రలు సీఐటీయూ నాయకులతో కలిసి వెలుగుశాఖ పీడీ శోభన్‌బాబుకి వినతిపత్రం సమర్పించారు. తొట్టంబేడు మండలంలోని పొయ్య, లింగమనాయుడుపల్లి, తాటిపర్తి, కొణతనేరి, కాసరం పంచాయతీల్లో పనిచేసే సంఘమిత్రలను ఇటీవల అధికారులు విధుల నుంచి తొలగించారు. దాంతో బాధితులు న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించారు. వారికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు సంఘమిత్రలుగా కొనసాగించాలని కోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు సీఐటీయూ నాయకులు వెలుగుశాఖ పీడీని కలిసి కోర్టు ఉత్తర్వుల పత్రంతో పాటు తమ వినతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆర్డీవో రామ్మోహన్, చెన్నయ్య, చంద్రశేఖర్, బాలకొండయ్య పాల్గొన్నారు.

రైల్వే ఎన్నికల్లో..

చివరి రోజు 86 శాతం పోలింగ్

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లోని 34 పోలింగ్ కేంద్రాల్లో 86.16 శాతం ఓట్లు పోలయ్యాయి. చిత్తూరు, తిరుపతి, రేణిగుంట, పాకాల, శ్రీకాళహస్తి, వెంకటగిరి స్టేషన్లలో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. డ్రైవర్లు, గార్డులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తిరుపతిలో 849, రేణిగుంటలో 825, శ్రీకాళహస్తిలో 132, వెంకటగిరిలో 143, చిత్తూరులో 164, పాకాలలో 327 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. బాక్స్‌లకు సీల్‌వేసి రేణిగుంట ఇన్‌స్టిట్యూట్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు.